ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 24 అక్టోబరు 2024

● ఆరు నెలల నుంచి జమకాని స్టాంప్‌డ్యూటీ
● మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నిధుల గండం






డ్రోనాచార్యులు

సాంకేతికత.. వినూత్న ఆలోచన.. సులభతరం.. వేగవంతం.. తక్కువ ఖర్చు.. ఏదో సాధించాలన్న తపనతో నేటి యువతరం ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. వ్యవసాయంలో రైతుల కష్టాలను చూసి.. రైతు బిడ్డలు వినూత్నంగా స్పందించారు. ప్రకృతి వైపరీత్యాల్లో సులభంగా సేవలు అందించాలని మరికొందరు ముందుకు వచ్చారు. సీనియర్లు అందించిన పరిజ్ఞానాన్ని పరిశీలించి మరింత నాణ్యంగా, నైపుణ్యతతో ఆలోచించారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం మంగళగిరి వేదికగా నిర్వహిస్తున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024 వారి కష్టాన్ని, సాధించిన ఘనతను ప్రపంచం ముందు ఉంచింది. వారి ఆనందాన్ని, వారి కష్టాల వెనుక ఉన్న నేపథ్యాన్ని వారు ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం

అందరి లక్ష్యం సులభతర సేవలే

రైతుల కష్టాలే స్ఫూర్తిగా డ్రోన్ల సృష్టి

ఆంధ్రజ్యోతితో ఔత్సాహిక ఇంజనీర్లు, విద్యార్థులు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. ఎవరి అనుభవాలు వారివి.. ఎవరి దృష్టి కోణం వారిది.. కానీ లక్ష్యం మాత్రం అద్భుతమైన విహంగాలను సృష్టించడం. ఒకప్పుడు కేవలం ఫంక్షన్లలో వీడియోలు తీయడానికే పరిమితమైన డ్రోన్ సేవలు ఇప్పుడు అనేక రంగాల్లోకి విస్తరించాయి. ఏదో సాధించాలన్న తపన.. కొత్తదనం కోసం ఆరాటం.. అందుకోసం ఔత్సాహిక యువ ఇంజనీర్లు, విద్యార్థులు సాగించిన అన్వేషణ.. వారికి లభించిన ప్రోత్సాహం.. తోడ్పాటు.. వెరసి రాబోయే యుగ దూతగా డ్రోన్లు ప్రజల ముందుకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైన డ్రోన్ సమ్మిట్ వారి ఉత్సాహాన్ని మరింత పెంచింది.

రైతుల కష్టాలు చూసి కదిలిపోయా



మాది కృష్ణాజిల్లా ఉయ్యూరు పక్కన నెప్పల్లి గ్రామం. మాది రైతు కుటుంబం. ఎరువులు, పురుగు మందులు చల్లేటప్పుడు రైతులు, కూలీలు పడే కష్టం, జరిగే ప్రాణాంతక ప్రమాదాలు చూశా. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేశాను. చదువు వ్యవసాయానికి ఉపయోగపడేలా ఆలోచించా. మా ఫ్రెండ్ కమల్ తోడుగా నిలిచాడు. ఇద్దరం కలిసి హైబ్రిడ్ ఇంజన్ డ్రోన్‌ను సిద్ధం చేశాం. దానితో ప్రతి రోజూ 30 ఎకరాల్లో సులువుగా ఎరువులు, పురుగు మందులు చల్లవచ్చు. డ్రోన్లు కొనలేనివారికి కూడా మేం సేవలు అందిస్తున్నాం. ఇప్పటికి 25వేల ఎకరాల్లో డ్రోన్లతో సేవలు చేస్తు న్నాం. లాజిస్టిక్ డ్రోన్లు ద్వార వరదల్లో చిక్కుకున్న విజయవాడ వాసులకు ఆహార పొట్లాలు, నీళ్లు, అత్యవసర మందులు అందజేశాం.

-గోపీ వెంకట కృష్ణ, ఉయ్యూరు

ఆరో తరగతి నుంచి ప్రయోగాలే



మాది విశాఖపట్నం. మెకానికల్ ఇంజనీరింగ్ చదివా. చిన్నప్పటి నుంచి నాకు విమానాలు అంటే ఆసక్తి. అందుకే నేను ఆరో తరగతి నుంచే ప్రయోగాలు చేసేవాడిని. మా నాన్నగారు నన్ను ప్రోత్సహించేవారు. ఖర్చు భరించేవారు. కాలేజీలో చేరాక నా ఆసక్తికి మార్గం దొరికింది. ఇండస్ట్రియల్ డ్రోన్లు రూపొందించా. వాటిని ప్రమోట్ చేసేందుకు పెద్ద పెద్ద సంస్థలు కూడా ముందుకు వచ్చాయి. ఇప్పటి వరకూ 10 సమ్మిట్లలో పాల్గొన్నా. రఘు ఇంజనీరింగ్ కాలేజీలో 2వ బహుమతి వచ్చింది.

- ఏ. ప్రవీణ్, విశాఖపట్నం

తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం



మేం ఎస్సార్ఎం కాలేజీలో చదువు తున్నాం. అత్యవసర మందులు అందించేందుకు వీలుగా డ్రోన్లు రూపొందించాం. సెల్ ఫోనులో వినియోగించే బ్యాటరీకి రెట్టింపు సైజులో అంటే 10వేల ఎంఏహెచ్ బ్యాటరీతో నడిచే తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం. దాన్ని అందించడానికి ఒక వెబ్ ఇంటర్‌ఫేజ్ ఏర్పాటు చేసి, ఆటోమేటిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి 10 కి.మీ. పరిధిలో మందులు అందించేందుకు వీలుగా డ్రోను రూపొందించాం.ఆమోదం వస్తే సేవలు మొదలుపెడతాం.

- మణికంఠ, పుష్పక్, అజిత్

అవయవాల తరలింపు కోసం డ్రోన్

కిలో.. రెండు కిలోల లగేజీ మోసే డ్రోన్లకు భిన్నంగా రూపొందించాలని భావించాం. అందుకే 7 కిలోల పే లోడ్ ఉండేలా డ్రోన్ రూపొందించాం. ఇందులోని బ్యాగులో మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ చల్లదనం ఉంటుంది. అందువల్ల అత్యవసర మందులు, మానవ అవయవాలు భద్రంగా, వేగంగా తరలించవచ్చు. వేగం కూడా గంటకు 125 కి.మీ. ఒకసారి చార్జ్ చేస్తే 150 కిలో మీటర్ల దూరం ప్రయాణించగలదు.

- ఏకాంత్, తంజావూర్



హైదరాబాదు కేంద్రంగా స్టార్టప్



మాది తాడేపల్లిగూడెం పాలకొల్లు ప్రాంతం. రైతుల సమస్యలు చూసి డ్రోన్ల రూపకల్పన ఆలోచన చేశాం. కరోనా సమయంలో ఎరువులు, పురుగు మందులు ఉన్నా కూలీలు దొరక్క రైతులు నష్టపోయారు. అప్పుడే ఆలోచన చేసి డ్రోన్ల రూపకల్పన చేశాం. హైదరాబాదు కేంద్రంగా స్టార్టప్ ఏర్పాటు చేశాం. ఆంధ్రుల తొలి డ్రోన్ స్టార్టప్ మాదే కావడం విశేషం. 80 డ్రోన్లు రూపొందించాం. తొలి రోజుల్లో మేమే వెళ్లి స్వయంగా ఎరువులు, మందులు చల్లాం.ఇప్పుడు రెండో తరం డ్రోన్ సిద్ధమైంది. ఇలాంటివి 2025 నాటికి 2000 డ్రోన్లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రోత్సాహకాలు బాగున్నాయి. అందుకే హైదరాబాద్ నుంచి ఏపీ వచ్చేయాలనుకుంటున్నాం.

- హేమంత్, హనుమ, సాయిచరణ్

స్వామ్ డ్రోన్లదే రాజ్యం



ముందు ముందు స్వామ్ డ్రోన్లదే రాజ్యం. తమ సీనియర్లు డ్రోన్లు రూపొందించి ఆ విజ్ఞానాన్ని మాకిచ్చారు. అంతకన్నా భిన్నంగా రూపొందించాలని ఆలోచించాం. ఒక డ్రోన్ పనిచేయాలంటే ఒక మనిషి కావాలి. అలా వంద డ్రోన్లు పనిచేయాలంటే వందమంది కావాలి. మ్యాన్ పవర్ తగ్గేలా చేయాలనేది మాకొచ్చిన ఆలోచన. ఆ ప్రయత్నంలో స్వామ్ డ్రోన్ టెక్నాలజీని కనుగొన్నాం. ఈ విధానంలో ఒక డ్రోన్ ఇతర డ్రోన్లన్నింటినీ నడుపుతుంది. మాస్టర్ డ్రోనుకు కమాండ్స్ ఇస్తే అదే మిగిలిన డ్రోన్లకు వాటిని పంపుతుంది. ఇలా ఒక్క మనిషే అనేక డ్రోన్లు ఆపరేట్ చయవచ్చు. - విజ్ఞాన్ విద్యార్థులు

స్వదేశీ టెక్నాలజీతో డ్రోన్ చేశాం

ఉత్తరాంధ్రకు చెందిన ఆరుగురం స్నేహితులం. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ కేంద్రంగా 2018లో 15 లక్షల పెట్టుబడితో డ్రోన్లు తయారుచేయడం మొదలుపెట్టాం. తొలిగా నిఘా డ్రోన్లు తయారుచేసి ఆర్మీకి అందజేశాం. కరోనా తర్వాత అగ్రో బేస్డ్ డ్రోన్లపై దృష్టిపెట్టి ఒక డ్రోన్ తయారు చేశాం. దానికి ప్రభుత్వ అనుమతి కూడా లభించింది. ఇప్పుడు రెండో తరం డ్రోన్ సిద్ధం చేశాం. చైనా డ్రోన్లకు భిన్నంగా దేశీయ పరికరాలతో డ్రోన్లు రూపొందించాం. ఒకసారి ఫ్యూయల్ తీసుకుంటే పది సార్లు, పది ఎకరాలు ఎరువులు, మందులు పిచికారీ చేయవచ్చు. గడిచిన 3 నెలల్లో 200 యూనిట్లు విక్రయించాం. అమ్మకాలు 8 కోట్లకు చేరాయి. ఈ ఏడాది 15 కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నాం.

- తులసీరామ్, ఎరైస్ సొల్యూషన్స్





రిజిస్ట్రార్ కార్యాలయం

స్థానిక సంస్థలకు మొండిచేయి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సకాలంలో నిధులు జమ కాక స్థానిక సంస్థలైన పంచాయతీలు, మున్సిపాల్టీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. పల్లెల్లో పారిశుధ్య పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. మున్సిపాల్టీల్లో సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. చివరకు దస్తావేజు రుసుంలోనూ స్థానిక సంస్థలకు ప్రభుత్వం మొండిచేయి చూపుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,172 పంచాయతీలు, 17 పురపాలక సంఘాలకు సర్‌చార్జి సకాలంలో విడుదల కావడంలేదు. ఇల్లు, స్థలం, పొలం, అపార్ట్‌మెంట్ల క్రయవిక్రయాలు జరిగితే స్టాంపుడ్యూటీ సర్‌చార్జి స్థానిక సంస్థల ఖాతాలకు జమచేయాలి. ఉదాహరణకు ఒక స్థిరాస్తి రూ.కోటికి విక్రయాలు జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ1.5 లక్షలు ఆ పరిధిలోని పంచాయతీ లేదా మున్సిపాల్టీ ఖాతాకు జమ చేయాలి. అయితే ఆ ప్రకారం జరగడంలేదు. గుంటూరు జిల్లాలో అధిక శాతం స్థానిక సంస్థలకు ఏడాదిగా చెల్లింపులు జరగలేదు. పల్నాడు, బాపట్ల జిల్లాలో ఆరు నెలల వరకు సర్‌చార్జి జమకాలేదని ప్రజాప్రతినిధులు తెలిపారు. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి ద్వారా ఒక్కో జిల్లాలో ఆయా స్థానిక సంస్థలకు రూ.కోట్లల్లో నిధులు జమకావాలి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు, ఒక్కో వంతు జడ్పీ, మండల ప్రజాపరిషత్తులకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఈ ప్రక్రియలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. సర్‌చార్జి నిధులతో స్థానిక సంస్థల్లో అనేక అభివృద్ధి పనులు చేయడానికి వెసులుబాటు ఉంటుంది. మున్సిపాల్టీలకు దస్తావేజుల రుసుం నిలిచిపోవడంతో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేక.. కొత్తగా ప్రగతి పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. సర్‌చార్జికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రొసీడింగ్స్ పంపించకోకపోవడానికి ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడమేనని సమాచారం. కొంతమంది సర్పంచులు, పురపాలకులు రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరిగి స్టాంప్‌డ్యూటీ సర్‌చార్జి జమ చేయాలని కోరుతున్నా ఫలితం ఉండటంలేదు.

స్థానిక సంస్థలను ఆదుకోవాలి

స్థానిక సంస్థలకు దస్తావేజు రుసుం వెను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్టాంప్‌డ్యూటీ సర్‌చార్జి చెల్లిస్తే గ్రామాల్లో నీటి సరఫరా, పారిశుధ్య పనులకు, కార్మికుల జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులుబాబు ఉంటుందన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

ఏం బలరాం.. బాగున్నావా

● సీఎం చంద్రబాబు పలకరింపు



సీఎం చంద్రబాబుతో కరచలనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బలరాం

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏం బలరాం.. బాగున్నావా అని సీఎం చంద్రబాబు, చీరాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంను కుశలప్రశ్నలతో పలకరించారు. గుంటూరులో బుధవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు మనువడు, కరణం బలరాం వియ్యంకుడు బాలకృష్ణారావు మనవరాలి వివాహ నిశ్చితార్థ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, కరణం బలరాంలు పలకరించుకున్నారు. ఆ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

రూ.లక్షకు పసికందు విక్రయం

● నగదు వివాదంతో బహిర్గతమైన వైనం

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని మూడునెలల పసికందును రూ.లక్ష విక్రయించిన ఓ తల్లి సంఘటన బాపట్లలో చర్చనీయాంశమైంది. పట్టణంలోని 11వవార్డు ఇందిరానగర్‌కాలనీకి చెందిన ఓ మహిళ మూడునెలల బిడ్డను ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ఓ మహిళకు మంగళవారం విక్రయించింది. డబ్బుల విషయంలో తలెత్తిన వివాదంతో విషయం బయటకు పొక్కింది. దీంతో తన బిడ్డను తనకు తిరిగి ఇవ్వాలని వాదనకు దిగడంతో అధికారుల దృష్టికి వెళ్ళింది. దీంతో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పురుషోత్తం విచారించి బుధవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ జేజే యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బిడ్డను బాలికాసదన్‌కు తరలించారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా బిడ్డను విక్రయించినట్లు తల్లి చెబుతుంది.

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!



ఆర్జేడీ కార్యాలయం

● డిగ్రీ కళాశాలల్లో నిర్దేశించిన దానికంటే డబుల్ వసూళ్లు
● ఒక్కో విద్యార్థికి అదనంగా రూ. 20 వేలు భారం
● ప్రేక్షక పాత్రలో ఆర్‌జేడీ కార్యాలయ అధికారులు

గుంటూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో యాజమాన్యాలు వసూలు చేసే ఫీజుల దందాకు విద్యార్థులు హడలిపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కౌన్సెలింగ్ ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తూ విద్యార్థులను గుల్ల చేస్తున్నారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల్లో జరిగే ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అక్రమ ఫీజుల దందాలో వారు కూడా భాగస్వాములు

(మిగతా 6వ పేజీలో)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ - బాపట్ల జిల్లా.

లెటర్.నెం. ఎం.కె.టి.జి./గోనె సంచుల రవాణా/2024-25 తేది:23.10.2024

గోనె సంచుల రవాణా రీ - షార్ట్ టెండర్ నోటిఫికేషన్

బాపట్ల జిల్లాలో గల పౌర సరఫరాల సంస్థలో 2024-25 సంవత్సరం కొరకు అనగా తేది: 30.09.2025 ముగింపు కాలమునకు జిల్లాలో గల స్టోరేజ్ పాయింట్ల (SWC,IG మరియు MLSPల) నుండి (కొత్త, పాత ఒకసారి వాడిన గోనె సంచులను మరియు PP సంచులను) PPCs లకు/ RSKs లకు/ రైస్ మిల్లులకు మరియు మండల స్థాయి గోదాముల నుండి ప్రభుత్వ నిర్దేశిత ప్రాంతములకు గోనె సంచులను రవాణా చేయుట నిమిత్తము అనగా రెండవ దశ రవాణా కాంట్రాక్టర్లను ఈ కాంట్రాక్ట్ నియమించిన తేది నుండి తేది : 30.09.2025 వరకు నియమించుటకు గాను తేది : 31.10.2024 మధ్యాహ్నం 12.00 గంట లోపు (పని దినములలో) మరల టెండరు ఫారములు అమ్ముటకు నిర్ధేశించబడినది. కావున ఉత్సాహము కల వారు ఏదేని జాతీయ బ్యాంకులో District Civil Supplies Manager, APSCSCL, Bapatla వారి పేరిట రూ. 5,600/- (Tender form Rs. 5000+Rs.600 GST) లకు డిమాండ్ డ్రాఫ్టును చెల్లించి జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కార్యాలయము నందు ఈ క్రింది వివరించిన షెడ్యూల్ ననుసరించి టెండర్ ఫారము మరియు టెండర్ నియమ నిబంధనలను పొందవచ్చును.

టెండర్ షెడ్యూల్

1) కాంట్రాక్టు పీరియడ్ : ది. టెండర్ ఖరారు అయిన తేది నుండి 30.9.2025 వరకు
2) టెండర్ ఫారములు అమ్మకము తేది (పని దినములలో) : 24.10.24 నుండి
3) టెండర్ ఫారములు అమ్ముటకు ఆఖరు తేది / సమయము : 31.10.24 మధ్యాహ్నం 12 గం.ల వరకు (పని దినములలో మాత్రమే టెండర్ ఫారములు అమ్మబడును)
4) టెండర్ ఫారములు దాఖలు చేయుటకు ఆఖరు తేది / సమయము : 31.10.24. సాయంత్రం 5.గం.ల వరకు. (పని దినములలో మాత్రమే టెండర్ ఫారములు స్వీకరించబడును)
5) టెండర్స్ తెరిచే తేది / సమయము ప్రదేశము : 04.11.24 సాయంత్రం. 04.00 గం.లకు జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఛాంబర్, కలెక్టరేట్, బాపట్ల.

ఏ కారణమూ చూపకుండా టెండర్‌లలో మార్పులు చేయుటకు కానీ వాయిదా వేయుటకు గాని, పూర్తిగా రద్దు చేయుటకు (పరచుటకు) గాని జిల్లా జాయింట్ కలెక్టర్ బాపట్ల వారికి పూర్తి అధికారము కలదు.

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఈ.ఓ.ఈ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, బాపట్ల జిల్లా.

మాయా బజార్!

● సెకండ్ హ్యాండ్, స్పేర్ పార్టుల కాణాచి మాయాబజార్
● గుంటూరుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సముదాయం
● జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఓల్డ్ మోటార్ మార్కెట్
● చుట్టుపక్కల నాలుగు జిల్లాలకు అదే కేరాఫ్ అడ్రస్
● ఇక్కడ నుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన లాల్‌జాన్ బాషా



ఆహ్లాదం.. వినోదం.. సాహసం

8

◆ కోటప్పకొండలో ఆకట్టుకుంటున్న నగర వనం
◆ రూ 1.40 కోట్లతో ఏర్పాటు చేసిన అటవీశాఖ



సాహస క్రీడా ప్రాంగణం

నేటి నుంచి వర్సిటీలో యువజనోత్సవాలు

పెదకాకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నేటి నుంచి యువజన ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు వర్సిటీ రిజిస్టర్ ఆచార్య సింహాచలం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువజనోత్సవాల నిర్వహణకు కోఆర్డినేటర్‌గా ఆచార్య మురళీమోహన నియమించామన్నారు. వర్సిటీ పరిధిలోని అనేక కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - సాతులూరు రైల్వే స్టేషన్‌ల మధ్య మంగళవారం రాత్రి పట్టణంలోని క్రిష్టియన్‌పాలెం వద్ద ఓ వ్యక్తి తనంతట తానుగా అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు నరసరావుపేట రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ బుధవారం తెలిపారు. మృతుడి వద్ద విజయవాడ - నరసరావుపేట రైల్వే ప్రయాణ టిక్కెట్ ఉందన్నారు. మృతుడు నలుపు రంగు పొడుగు చేతుల చొక్కా, నలుపు రంగు కాటన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐని సంప్రదించాలని కోరారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటి మట్టం బుధవారం నాటికి 589.40 అడుగులు ఉంది. ఇది 310.25 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 48,284 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 48,284 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,269 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు.

ఉపాధి రికార్డులు ఏవీ?

- ఏడు నెలలు గడిచినా.. ఏడు రోజులు గడువు కావాలంట
- ఆడిట్ బృందానికి చుక్కలు చూపిస్తున్న ఉద్యోగులు
- ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన సామాజిక తనిఖీలు
- నిధులు స్వాహా చేశారేమోనని అనుమానం

నకరికల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను స్వాహా చేశారు. రికార్డులను అప్పగించటానికి మాత్రం వారం రోజులు గడువు కావాలంటూ ఉపాధి ఉద్యోగులు కోరారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరం ముగిసి ఏడు నెలలు గడుస్తున్నా రికార్డులు సమర్పించటానికి గడువు కోరటం సామాజిక తనిఖీ బృందాలకు అక్రమాలు జరిగాయనే అనుమానాలు బలపడుతున్నాయి. సకాలంలో రికార్డులు అందజేయలేదని సామాజిక తనిఖీ బృందం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ మండలంలోకి రెండుసార్లు సామాజిక తనిఖీ బృందాలు వచ్చి వెళ్లాయి. వివరాల్లోకి వెళ్తే.. గత ఆర్థిక సంవత్సరంలో అతి తక్కువ నమోదయ్యే నకరికల్లు మండలంలో అతి ఎక్కువ పని దినాలు నమోదు అయ్యాయి. ఇదంతా రికార్డుల సృష్టే తప్పా క్షేత్ర స్థాయిలో పనులు జరగలేదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఉపాధి హామీలో పని చేస్తున్న ఉద్యోగులు కొందరు కొన్నేళ్లుగా ఇక్కడే ఉండటం వలన



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

గ్రామాల వారీగా నిధుల వినియోగం

కాగా గ్రామాల వారీగా గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుంకలగుంటలో రూ. 1,40,20,881, జల్లాపేట తండా రూ.5,44,984, గుండ్లపల్లి రూ. 1,25,77,018, బాలాజీ నగర్ తండా రూ.15,61,382, నకరికల్లు రూ. 1,02,68,969, శివాపురం తండా రూ.8,06,682, దేచవరం రూ.33,80,340, చేజర్ల రూ. 98,86,551, చాగల్లు రూ.39,32,945, చీమలమర్రి రూ. 70,84,405, త్రిపురాపురం రూ.32,82,261, రూపెనగుంట్ల రూ.58,23,343, తురకపాలెం రూ.40,37,342, చల్లగుండ్ల రూ.56,07,0277, కండ్లకుంట రూ.36,25,811, అడ్డరోడ్డు రూ.22,51,089, నరసింగపాడు రూ.38,86,384 రూపాయలుగా ఉపాధి నిధులను వినియోగించినట్లు సామాజిక తనిఖీ బృందాలకు లెక్కగా చూపారు.

పని దినాలు ఇలా..

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూలీలకు చెల్లింపుల కింద రూ.7.82 కోట్లు, మెటీరియల్ కింద రూ.2 కోట్ల మేర ఖర్చులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. మూడు రోజుల క్రితం ఆడిట్ బృందాలు తనిఖీకి వచ్చినా ఉపాధి ఉద్యోగులు రికార్డులు ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారని ఆడిట్ బృందాలు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గ్రామాల వారీగా అత్యధికంగా కుంకలగుంటలో 52,088 పని దినాలు, గుండ్లపల్లిలో 46,214, నకరికల్లులో 35,100, చేజర్లలో 31,501, చీమలమర్రిలో 28,490, రూపెనగుంట్లలో 24,083, చల్లగుండ్లలో 18,900, కండ్లకుంట 14,959, తురకపాలెంలో 13,660, చాగల్లు 11,681, త్రిపురాపురం 11,217, దేచవరం 10,161, అడ్డరోడ్డు 9,295, నరసింగపాడు 8,452, బాలాజీ నగర్ తండా 6,481, శివాపురం తండా 2,733, జల్లాపేట తండా 2,518 పని దినాలు మొత్తంగా 3,27,533 పని దినాలు నకరికల్లు మండలంలో నమోదయ్యాయి.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు గుర్తిస్తే అందుకు బాధ్యులైన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధాలింగమూర్తి తెలిపారు. సామాజిక తనిఖీలు వాయిదా పడిన విషయం గురించి మాట్లాడుతూ రికార్డులు అందజేయకపోవటం, సిబ్బంది అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో సామాజిక తనిఖీ బృందాలను వేరే మండలాలకు పంపించినట్లు తెలిపారు. రికార్డులు ఇవ్వని, అక్రమాలకు బాధ్యులైన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అవుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కుపైగా ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు దాదాపు 24 వేల మంది ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో మాదిరిగానే డిగ్రీ కళాశాలల్లోనూ ఫీజుల్ని నిర్దేశించారు. సాధారణ కోర్సులకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు, బీఎస్సీ కంప్యూటర్, ఇతర కోర్సులకు రూ. 18 వేల వరకు ఫీజులు నిర్దేశించారు. ఇంతకు మించి అదనంగా ఫీజులు వసూలు చేయకూడదని ఉన్నా, యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే డబుల్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే.. వేధింపులు

గుంటూరు నగరం నడిబొడ్డున్న ఉండి సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పుకునే కళాశాలల్లో ఇటీవల భారీ మొత్తంలో అదనంగా ఫీజులు వసూలు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ.20



అదనపు ఫీజులకు నిరసనగా ఇటీవల నగరంలోని ఓ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నిరసన (పాత చిత్రం)

వేలకుపైగా ఫీజులు వసూలు చేశారు. దీనికి ల్యాబ్, ఎగ్జామినేషన్ ఫీజులు అదనంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఇప్పటికే రెండుసార్లు ఆర్‌జేడీ కార్యాలయంలో, మరో రెండు సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా యాజమాన్యంలో మార్పురాలేదు సరికదా ఫిర్యాదు చేసిన విద్యార్థులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- నగరంలో మహిళల కోసం ఉన్న ఒక అన్‌ఎయిడెడ్ కళాశాలలో కూడా ఇష్టారాజ్యంగా ఫీజులు దందా నడుస్తోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకున్నా ఫీజులు మాత్రం భారీగానే ఉంటున్నాయి. యాజమాన్యాలు చెప్పిందే ఫీజు అంటూ వసూళ్ల పర్వం సాగుతోంది. దీనికి అరకొర వసతులతో హాస్టల్ నిర్వహిస్తూ ఫీజులు దండుకుంటున్నారు. ఇక్కడ కళాశాలకు గ్రౌండ్, ఇతర మౌలిక వసతులు లేకున్నా భారీ సంఖ్యలో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. ఫీజుల భారం, కళాశాల యాజమాన్యం వేధింపులతో ఓ విద్యార్థిని మూడోఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- బ్రాడీపేట ప్రాంతాల్లో ఉన్న మూడు అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఫీజుల దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఓ కళాశాల కరస్పాండెంట్ ఒకే ప్రాంగణంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు, హాస్టల్ నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో ఇదే ప్రాంగణంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- తెనాలి, నరసరావుపేట, మాచర్ల ప్రాంతాల్లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్ని గత ఐదేళ్లలో ఏనాడు ఉన్నత విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసిన సంఘటనలు లేవు. పల్నాడులో ఎక్కడ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి అనే విషయం కూడా ఆర్‌జేడీ కార్యాలయం అధికారులకు తెలియని పరిస్థితి.

ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు

జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు చెల్లించే ఎగ్జామినేషన్ ఫీజుతోపాటు, సర్టిఫికెట్లు జారీ సమయంలో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాల అభివృద్ధి పేరుతో కొన్ని చోట్ల అదనపు దోపిడీ సాగుతోంది.

బాలిక మృతిపై జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెనాలి బాలిక మృతి ఘటనపై గుంటూరులో జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. బుధవారం గుంటూరులోని తన పార్టీ కార్యాలయం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రమ్య అరుద్ర హత్యలు సందర్భంగా పర్యటనకు వచ్చిన లోకేష్, మాపై గతంలో కేసులు పెట్టారని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, జగన్ ఇంకా ముఖ్యమంత్రిగానే ఊహించుకుంటున్నారని అన్నారు. మేము బాధితులను పరామర్శించడానికి వెళ్తే వాళ్ల కార్యకర్తలను పంపించి ఆందోళన చేయించారన్నారు. ఈ రోజు ఎన్డీయే ప్రభుత్వంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జగన్ హెలికాప్టర్‌లో దిగారని, గత ప్రభుత్వంలో హత్యలు, అత్యాచారాలు చేసిన వ్యక్తులను కాపాడిన వ్యక్తి జగన్ అన్నారు. తాడేపల్లి జగన్ ప్యాలెస్ దగ్గర జరిగిన ఘటనలో వేణుగోపాల్ రెడ్డిని జగన్ కాపాడారని, వాలంటీర్లు, ఒంటరి మహిళలపై అఘాయిత్యాలు చేస్తే జగన్ పట్టించుకోన్నాడా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో



ఉన్న సమయంలో జరిగిన ఘటనల్లో బాధితులను జగన్ ఎందుకు పరామర్శించ లేదన్నారు. గత ప్రభుత్వంలో తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా హత్యలు, హత్యాచారాలు జరిగాయన్నారు. ప్రస్తుత ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని, బాధితులకు అండగా నిలబడి, నిందితులను వెంటనే అరెస్టు చేసిందన్నారు. జగన్ అరాచకాలకి సపోర్ట్ చేసిన అధికారులు ఈ రోజు కేసుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. జగన్ పెంచి పోషించిన అసాంఘిక కార్యకలాపాలు, వ్యక్తులు, గంజాయి వలన సమాజంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. బాధిత మహిళపై జరిగిన దాడి విషయంలో చెప్పకూడని అంశాలు మీడియా ముందుకు వచ్చి జగన్ మాట్లాడారని, ఇది చాలా తప్పని అన్నారు. గత ప్రభుత్వంలో దిశా యాప్ పనితీరు శూన్యమని, దిశా పేరుపై జగన్ డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. దిశా యాప్‌ని బలవంతంగా ఫోన్లో డౌన్లోడ్ చేయించారని, దిశా యాప్ ఉంటే ఎందుకు గత ప్రభుత్వంలో మహిళలపై దాడులు జరిగాయని విమర్శించారు.

వారంలోపే రిటర్నబుల్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు

తుళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ)కు భూ సమీకరణ పథకంలో భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆదేశానుసారం వారం లోపు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసే ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ రైతులకు తెలిపారు. లాటరీలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు సంబంధిత అథారిటీ ఎక్కడా అంతరాయం లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. గతంలో రిటర్నబుల్ ప్లాట్లు పొందని రైతులకు బుధవారం విజయవాడ ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ లాటరీ నిర్వహించారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు తొలుత ట్రైలర్ రన్ వేసి, తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియ చేపట్టారు. లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు సంబంధిత అధికారులు ప్లాట్లు కేటాయింపు పత్రాలను అందజేశారు. అమరావతిలోని ఎల్పీఎస్ లే అవుట్‌లకు మౌలిక సదుపాయాల పనులు డిసెంబరు నుంచి ప్రారంభం అవుతాయన్నారు. లాటరీ అనంతరం ప్లాట్లు అందుకున్న రైతులకు సీఆర్డీఏ జీఐఎస్ బృందం ఆయా గ్రామాల మ్యాప్‌ల ద్వారా కేటాయించిన ప్లాట్ల ప్రదేశాన్ని వివరించారు. తొలి రోజు జరిగిన ఈ లాటరీలో తొమ్మిది గ్రామాలకుగానూ 23 మంది రైతులకు 68 రిటర్నబుల్ ప్లాట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ



లాటరీలో ప్లాట్లు పొందిన వారికి పత్రాలు అందిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్

సీఆర్డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ఎస్. రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.డేవిడ్ రాజు, ఎం.విశ్వేశ్వర నాయుడు, జి.భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాస్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు లాటరీ జరగనున్న గ్రామాలు..

గురువారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నవులూరు, నిడమర్రు 1, 2 రైతులకు లాటరీ తీస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బోరుపాలెం, రాయపూడి, నెక్కల్లు, నేలపాడు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం రైతులకు లాటరీ తీస్తారని అధికారులు తెలిపారు.

రూ.61 లక్షల ఆస్తి సేవా సంస్థలకు దానం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్‌టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్టా రాజ్యలక్ష్మి చిరస్మరణీయురాలని సెంట్రల్ జీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నావారితోటలోని జీఎస్‌టీ భవన్‌లో కమిషనర్ చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు చెక్కులు అందజేశారు. అనంతరం కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ గజిటెడ్ అధికారిగా సమర్థవంతమైన సేవలు అందించి, ఇప్పుడు మానవత్వం కలిగిన మనిషిగా ఆమె కీర్తి గడించారని కొనియాడారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, షిరిడీ సాయి సేవా ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, శిష్టా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటు చేసుకున్న మెమోరియల్ ట్రస్ట్‌కు రూ. 36 లక్షలు చెక్కుల రూపంలో రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో, ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టే వెంకట్ లకు కమిషనర్ అందజేశారు. రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్ కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, సూపరింటెండెంట్లు సీహెచ్ వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్ ఈశ్వర్, యుగంధర్, మూర్తి పెన్షనర్ల సంఘం తరుపున వివేకానంద, పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా రైళ్ల టిక్కెట్లు

- సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్



గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో నగదు రహిత లావాదేవీలను అన్ని స్థాయిల్లో ప్రోత్సహిస్తున్నాం. డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకొని ప్రయాణికులకు వివిధ సేవలను సులభతరం చేస్తున్నామని గుంటూరు రైల్వే డివిజనల్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో యూటీఎస్ యాప్, డిజిటల్ చెల్లింపులపై ఫటాఫట్.



యూటీఎస్ యాప్ వినియోగించి ఎంతశాతం మంది ప్రయాణికులు టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొంటున్నారు?

ఎస్.డీసీఎం: యూటీఎస్(అన్ రిజర్వుడ్ టిక్కెటింగ్ సిస్టమ్) యాప్ వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది. డివిజనల్‌లో జనరల్ టిక్కెట్లలో 7 శాతం యూటీఎస్ యాప్ ద్వారా బుకింగ్ జరుగుతున్నాయి.

రైల్వేబోర్డు యూటీఎస్ యాప్‌లో టిక్కెట్ల బుకింగ్‌కు ఎంత శాతం లక్ష్యాన్ని నిర్దేశించింది?

ఎస్.డీసీఎం: రైల్వేబోర్డు మొత్తంగా ఏడాదికి 14 శాతం యూటీఎస్ యాప్ ద్వారా టిక్కెట్‌లు బుకింగ్ జరిగేలా చూడాలని లక్ష్యం పెట్టింది. ఇందుకోసం అన్ని రైల్వేస్టేషన్లు, రైళ్లలో కమర్షియల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలానే డ్రైవ్‌లు కూడా చేపడుతున్నాం.

యూటీఎస్ యాప్ ద్వారా ఎన్ని కిలోమీటర్ల దూరం నుంచి టిక్కెట్ బుకింగ్ చేసుకోవచ్చు?

ఎస్.డీసీఎం: యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు 50 కిలోమీటర్ల దూరం నుంచే జనరల్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవచ్చు. గ్రామం/ఇంటి వద్దనే యాప్‌లో టిక్కెట్ బుకింగ్ చేసుకొని రైల్వేస్టేషన్‌లో నేరుగా రైలు ఎక్కేయొచ్చు. క్యూలైన్లలో నిలుచోవాల్సిన పని ఉండదు.

యూటీఎస్ యాప్ వినియోగించే వారికి ప్రోత్సాహం ఏమైనా ఇస్తున్నారా?

ఎస్.డీసీఎం: యూటీఎస్ యాప్‌లో ఆర్ వ్యాలెట్ ద్వారా నగదు రీచార్జ్ చేసుకొంటే 3 శాతం బోనస్ వస్తుంది.

యూపీఐ ద్వారా చెల్లింపులకు అవకాశం కల్పిస్తున్నారా?

ఎస్.డీసీఎం: రైల్వేస్టేషన్లలో కౌంటర్ల వద్ద టిక్కెట్‌లు తీసుకొనేవారు ఏ యూపీఐ యాప్(జీపే, ఫోన్‌పే, పేటీఎం, మొబిక్విక్ వంటి వాటి) ద్వారా క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి నగదు చెల్లించి టిక్కెట్‌ని పొందవచ్చు. దీని వలన చిల్లర కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి.

జిల్లా పరిషత్ బకాయిలు విడుదల చేస్తాం

- జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర దంపతులకు సీఎం హామీ

గుంటూరు సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు అన్నీ వెంటనే విడుదల చేయిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్ దంపతులకు హామీ ఇచ్చారు. కత్తెర దంపతులు సీఎం కార్యాలయంలో చంద్రబాబు నాయుడుని కలిసి జడ్పీ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిషత్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరగా, బిల్డింగ్ నిర్మించి ఎన్ని సంవత్సరాలు అయ్యిందని చంద్రబాబు చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. అందుకు ఆమె 70 ఏళ్లు అయ్యిందని చెప్పటంతో నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. మూడేళ్లుగా వాహనం లేకుండా ఉన్నానని చైర్‌పర్సన్ చెప్పటంతో, వెంటనే వాహనాన్ని కేటాయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరికొన్ని సమస్యలను సీఎంకు వివరించగా సంబంధిత అధికారులకు సీఎం వెంటనే ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.



సీఎం చంద్రబాబు నాయుడుతో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, డాక్టర్ సురేష్ కుమార్

డయేరియా లక్షణాలతో కాలేజి విద్యార్థి మృతి

దాచేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డయేరియా లక్షణాలతో కాలేజి విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం అంజనాపురం కాలనీలో చోటు చేసుకుంది. మృతుని తల్లిదండ్రులు తమ్మిశెట్టి కృష్ణారావు, శివకుమారి తెలిపిన వివరాల మేరకు.. మృతుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (21) మాచర్లలోని డిగ్రీ కళాశాలలో బి.కాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఉండగా నారాయణపురంలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పిడుగురాళ్లకు తరలించి అక్కడి నుంచి నరసరావుపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు కృష్ణారావు, శివకుమారి క్వారీ కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడం తల్లిదండ్రుల్లో తీరని శోకాన్ని నింపింది. మృతునికి తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. అంతేకాకుండా అంజనాపురం కాలనీలో నివాసముంటున్న బండారు చినవీరయ్య, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, దేవళ్ల సైదులు, శాంతమ్మలు డయేరియా బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరు దాచేపల్లి, పిడుగురాళ్లలోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.



వెంకటేశ్వర్లు (ఫైల్‌ఫొటో)

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు భారతీయ విద్యాభవన్ విద్యార్థి

గుంటూరు(విద్య),అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 18,19తేదీల్లో కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ విద్యార్థి సత్తా చాటినట్లు కార్యదర్శి పి.రామచంద్రరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ విద్యాభవన్‌లో 6వ తరగతి చదువుతున్న యంగలశెట్టి జెనీస్ విశ్వసాయి పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బం గారు పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. జెనీస్‌ని ప్రిన్సిపల్ ఎస్ హేమాంబ, కోచ్ ఇమ్రాన్‌ఖాన్ అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

29,340 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 31,357 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 29,340 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,629 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8200	16200	334	8500	16000
నెంబరు.5	8500	16000	నెంబరు. 5	10500	12000
273	11000	13500	273	13000	14000
341	9000	16000	341	10000	16500
4884	12000	13800	4884	11500	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18600	తేజ	8500	18500
బ్యాడిగి	8500	16000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	9000	16000	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

● ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు



బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : దీపావళి మందుగుండు సామగ్రి విక్రయించేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని బాపట్ల అగ్నిమాపకాధికారి వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో పలు అంశాలు మాట్లాడారు.



దీపావళి మందుగుండు సామగ్రి విక్రయ దుకాణాలు ఎన్నింటికి అనుమతిస్తారు?

ఫైర్ ఆఫీసర్ : ఒక ప్రదేశంలో 50 షాపులకు మించి అనుమతి ఇవ్వటం కుదరదు.

ఏవిధమైన నిబంధనలు వర్తిస్తాయి..?

ఫైర్ ఆఫీసర్ : మందుగుండు సామగ్రి విక్రయించేవారు అన్ని రకాల అనుమతులు తీసుకొని రేకులతో షెడ్డు నిర్మించాలి. ప్రతి దుకాణానికి మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి. ప్రతిషాపులో రెండు కెమికల్ పౌడర్ సిలిండర్లు, రెండు ఇసుక, రెండు నీటి బక్కెట్లు, నాలుగు డ్రమ్ములలో నీరునింపి ఉంచాలి. షాపులు ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలి.

బాపట్లలో గ్రౌండ్ ఎక్కడ నిర్ణయించారు..?

ఫైర్ ఆఫీసర్ : జీబీసీ రోడ్డులోని ఏటీఎం కాంపౌండ్, తూర్పుసత్రం ప్రాంగణం, మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ పరిశీలించాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రౌండ్ ప్రకటిస్తాం.

అనుమతులు ఏవిధంగా ఇస్తారు..?

ఫైర్ ఆఫీసర్ : రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపకాధికారులకు సంబంధిత ఖాతాలో చలాన చెల్లించి అనుమతి పొందాలి. సూచించిన ప్రాంతంలోనే ఏర్పాటు చేసుకోవాలి. బినామీ పేర్లతో ఏర్పాటు చేయరాదు.

గత ఏడాది ఏవిధంగా ఏర్పాటు చేశారు?

ఫైర్ ఆఫీసర్ : గత ఏడాది మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో 42 దుకాణాలకు అనుమతులివ్వటం జరిగింది. 50 మీటర్ల లోపు ఎటువంటి భవనాలు ఉండరాదు. 18 సంవత్సరాలలోపు పిల్లలను షాపులలో పనికి పెట్టుకోరాదనే నిబంధనతో ఏర్పాటు చేసుకున్నారు.



నేడు పట్టభద్రుల ఓటర్ల అవగాహన సదస్సు

రేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం సమీక్ష చేయనున్నారని టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మధ్యాహ్నం జరిగే ఈకార్యక్రమంలో మంత్రి అనగాని, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు.

నేడు పల్స్ పోలియో కార్యక్రమం

బాపట్ల,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పోలియో డే సందర్భంగా గురువారం బాపట్ల పాతబస్టాండ్ దగ్గర పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, వేజండ్ల శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

నేడు కబడ్డీ పోటీలు

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికకు గురువారం పోటీలు నిర్వహిస్తున్నట్లు పీఈటీ షేక్ కరీముల్లా తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన జట్లు మాత్రమే పోటీలకు హాజరుకావాలన్నారు. తప్పనిసరిగా 2011 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని ద్వారా వయసు ధ్రువీకరణపత్రం తీసుకొని కోఆర్డినేటర్ అనుమతితో రావాలన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు నవంబరు 9, 10, 11 తేదీలలో పిట్టలవానిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగే పోటీలకు క్రీడాకారులు హాజరు కావాలన్నారు. క్రీడాకారులు ఎం.ప్రశాంత్, కత్తి శ్రీనివాసరావు, తిరుపతిరావులకు రిపోర్ట్ చేయాలని కరీముల్లా తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రేపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : 132 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గంగడిపాలెం, పోటుమెరక, బొబ్బర్లంక, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, చోడాయపాలెం, కైతేపల్లి, తుమ్మల, నిర్మల్‌నగర్,మోళ్ళగుంట, రాజుకాల్వ, లంకేవానిదిబ్బ గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

30న మండల పరిషత్ సమావేశం

వేమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. ఎంపీపీ యల్లమాటి మోహనరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ జరుగుతుందన్నారు. మండల పరిధి గ్రామాల్లో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించి సభ్యుల ఆమోదాన్ని పొందడం జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కర్లపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామపంచాయతీ దేవునిమాన్యంకు చెందిన యశ్వంత్‌కుమార్ పక్షవాతంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న బాపట్ల ఆదర్శ ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ వారు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు శ్రీరామసునీల్, గోపి, అశోక్‌కుమార్, బండి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, అంకమ్మరావు, రాజారమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మిచౌంగ్ పరిహారానికై రైతుల ఎదురుచూపు

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చిన పూజారి కనికరించలేదనే చందంగా మిచౌంగ్‌తుఫాన్ పరిహారం అందక వేలాది మంది రైతులు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లాలో 81,965 మంది రైతులకు సంబంధించిన పంటలు ముంపునకు గురయ్యాయి. దెబ్బతిన్న పొలాలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 91 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. మంజూరు చేసిన డబ్బులను ఆయా ప్రాంతాల రైతుల ఖాతాలలో జమ చేశారు. అయితే కొంతమంది రైతుల ఖాతానెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఆధార్‌నెంబరు వంటివి తప్పుగా నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో నెంబర్లు సరికాక జిల్లాలో 5,602 మంది రైతుల ఖాతాలలో ఇంకా 5.9 కోట్ల రూపాయలు జమ కావాల్సి ఉంది. డబ్బులు



మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన వరి పొలాలు (ఫైల్)

విడుదల చేసిన వ్యవసాయశాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్ల రైతుల ఖాతాలకు పరిహారం డబ్బులు జమకాలేదు. మరలా ఈ ఏడాది ఖరీఫ్ పంట చేతికొచ్చేందుకు సిద్ధంగా ఉంది. అయినప్పటికి గత ఏడాది పరిహారం ఇప్పటికి రాకపోవటంపై బాధిత రైతులు విమర్శిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకొని పరిహారం డబ్బులు బాధిత రైతులకు జమ అయ్యేవిధంగా చూడాలని కోరుతున్నారు. కాగా ఈ విషయమై వ్యవసాయశాఖ ఏడీఏ ఎ.లక్ష్మిని వివరణ కోరగా డబ్బులు జమకాని రైతుల వివరాలను సరిచేసి పంపించటం జరిగిందన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి : ఏడీఏ



నరసాయపాలెంలో రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న ఏడీఏ అనురాధ, ఏవో చంద్రశేఖర్

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రైతులు సామూహికంగా ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టాలని బాపట్ల భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ అనురాధ తెలిపారు. మండలంలోని నరసాయపాలెం, కంకటపాలెం గ్రామాలలో వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎలుకల మందు మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు. అనంతరం క్షేత్రస్థాయికి వెళ్ళి పొలాలలో ఎలుకల మందు పొట్లాలు పెట్టేవిధానాన్ని రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● వేమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంట భూముల్లో ఎలుకల నివారణ సస్యరక్షణ చర్యల్లో ఒకటని బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం సహాయ సంచాలకులు జీబీపీ ప్రవీణ అన్నారు. మండలంలోని బూతుమల్లిలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత అధ్యక్షతన బుధవారం జరిగిన ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమానికి ప్రవీణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. బ్రోమోడియాలిన్ మందు సామూహికంగా రైతులందరూ ఎలుకల నివారణ ఒకేసారి ఉపయోగించాలన్నారు. అనంతరం క్షేత్రాలను సందర్శించారు. గ్రామ సభ నిర్వహించి రైతులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు వివరించారు. గ్రామస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● నగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరి సాగులో ఎలుకల నియంత్రణ రైతుల ప్రధాన సమస్య అని మండల వ్యవసాయాధికారి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణ, పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని పెద్దపల్లి, ఈదుపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కె.నాగశ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 12 గ్రామ సచివాలయాలలో ఎలుకల నివారణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ విస్తరణాధికారి సీహెచ్ సుదర్శనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 12 రైతు సేవ కేంద్రాల పరిధిలో సామూహిక ఎలుకల నివారణ మందును బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, రైతులు, ఆయా గ్రామ పంచాయతీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమోతువారిపాలెం గ్రామంలో బుధవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు పాల్గొని ఎలుకల మందు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్ నవ్యశ్రీ, టీడీపీనాయకులు మునిపల్లె చిన్న, తాండ్ర శేషగిరి, సోమశేషయ్య, ఇక్కుర్తి ఆంజనేయులు, బీసాబత్తిన లక్ష్మణ, నర్రావుల మోహన్, గరిగంటి పవన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్లపాలెం సచివాలయం దగ్గర వ్యవసాయాధికారి సుమంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది తిరుమలరావు, భాగ్యలక్ష్మి కలిసి రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు.

● చుండూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంటలకు నష్టం కలిగిస్తున్న ఎలుకలను సామూహికంగా నివారణ పద్ధతులు పాటించడం వలన వాటిని పెద్ద ఎత్తున నివారించుకునేందుకు అవకాశం ఉందని పర్చూరు ఏడీఏ ఎం.మోహనరావు అన్నారు. బుధవారం దుండిపాలెం, యడ్లపల్లి రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల ఏవో వి.ఆదాంబాబు, రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి చేకూర్చాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా పేద ప్రజలకు లబ్ధి చేకూర్చటమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. కేంద్ర బృందం సభ్యులు ఎస్.శ్రీరామ్, పి.లోహిత్‌రెడ్డి బుధవారం కలెక్టరేట్‌కు చేరుకొని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రేపల్లె, వేమూరు, సంతమాగులూరు, చుండూరు మండలాలలో ఈనెల 26వ తేదీ వరకు పర్యటిస్తామని తెలిపారు. కేంద్రప్రభుత్వ పథకాల పనితీరుపై అనుబంధ శాఖల అధికారులతో స్థానిక జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయగ్రామీణ జీవనోపాధుల కొరకు కేంద్రప్రభుత్వం 12 పథకాలను అమలు చేస్తుందన్నారు. నిరుపేదలకు జీవనోపాధి కల్పించి వారి స్థితిగతులను మారుస్తాయన్నారు. ఈ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించటానికి కేంద్రబృందం బాపట్ల జిల్లాలో ఈనెల 26వ తేది వరకు పర్యటించనుందని తెలిపారు. 13 గ్రామాలను బృందం ఎంపిక చేసినట్లు వివరించారు. ఆగ్రామాలలో జాతీయగ్రామీణ, ఉపాధిహామీపథకం పనులను పరిశీలిస్తారన్నారు. కేంద్రబృందం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న నేపథ్యంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ పద్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీపీవో ప్రభాకర్, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారు ప్రారంభంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



తొలగించిన దుకాణాలు పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి, సీఐ అహ్మద్‌జానీ

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నాడు తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన రైతుబజారును ఉపయోగించకుండా పాడుపెట్టిన వైసీపీ పాలకుల చేష్టలతో వన్‌వే రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరేళ్ళగా మూలనపెట్టిన రైతుబజారును శుభ్రం చేసి రైతులకు, స్వయం సహాయక సంఘాల వారు తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు అప్పగించారు. ఆర్‌వోబి కింద హోల్‌సేల్ వ్యాపారులను మార్కెట్‌లోకి పంపించారు. దీంతో నిత్యం కూరగాయల మార్కెట్‌కు వచ్చేవారు తమ వాహనాలను ఆర్‌వోబి కింద పెట్టుకునే ఏర్పాట్లు చేయగా ట్రాఫిక్ సమస్య కూడా లేకుండా పోయింది. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ, సిబ్బందితో కలిసి రైతుబజారు పరిసరప్రాంతాలను బుధవారం పరిశీలించి వ్యాపారులకు తగుసూచనలు చేశారు. రోడ్డుపైన మరలా ఎవరైన దుకాణాలు పెట్టాలని చూస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోల్‌సేల్ వ్యాపారస్తులు మార్కెట్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను బహిరంగ వేలం ద్వారా పొంది వ్యాపారం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. అనంతరం రైతుబజారులో విక్రయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ షేక్ జబ్బార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇమామ్, శివరామకృష్ణ, శ్రీనివాసరావు, సీహెచ్ కరుణ పాల్గొన్నారు.

అమృత్ అవార్డు గ్రహీత శ్రీమన్నారాయణ కన్నుమూత



శ్రీమన్నారాయణ (ఫైల్)

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : బాపట్లకు చెందిన కూచిపూడి నాట్యకళాకారుడు మహంకాళి శ్రీమన్నారాయణ బుధవారం సాయంత్రం కన్నుమూశారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ అవార్డు అందుకున్న శ్రీమన్నారాయణ బాపట్ల కళాకారుడిగా గుర్తింపు పొందారు. 6 నెలలు క్రితం కేంద్రనాటక అకాడమి శ్రీమన్నారాయణకు అమృత్ అవార్డు ప్రదానం చేశారు. శ్రీమన్నారాయణ బాల్యం నుంచి నాట్యంపై ఎంతో మక్కువతో చిన్నతనంలోనే ప్రహ్లాదునిగా అద్భుతమైన ప్రదర్శనలిచ్చి మహనీయుల మన్ననలు పొందారు. శ్రీసత్యహరిశ్చంద్రలో లోహితాక్షుడుగా, మాతంగ కన్యలుగా, ఉషపరిణయంలో అనిరుద్ధునిగా, శ్రీకృష్ణునిగా అనేక పాత్రలు పోషించి అంచలంచలుగా ఎదిగారు. కూచిపూడి నాట్యకళలలో దాదాపు 30 వేల మంది శిష్యులను తయారు చేశారు. ఆయన మృతి చెందటం కళారంగానికి తీరనిలోటు అని పలువురు పేర్కొన్నారు.

రెవెన్యూ గ్రామసభలో 36 అర్జీలు

కొల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :భూముల రీసర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. మండల పరిధిలోని బొద్దులూరుపాడులో తహసీల్దార్ జి.వెంకటేశ్వర్లు నిర్వహించిన గ్రామ సభలకు వివిధ రూపాల్లో అభ్యంతరాలు తెలుపుతూ రైతులు బుధవారం అర్జీలు అందించారు. భూమికి సంబంధించి 9, పట్టాదారు పాసుపుస్తకంపై 10, మరో 17 ఇతర అభ్యంతరాలు తెలుపుతూ అర్జీలు అందించినట్లుగా తహసీల్దార్ తెలిపారు.

మద్యం దుకాణం వద్దంటూ మహిళల ఆందోళన



మహిళలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రవి, వేమూరు సీఐ ఆంజనేయులు

కొల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ మహిళలు రోడ్డుపై బైఠాయించి బుధవారం ఆందోళనకు దిగారు. కొల్లూరులోని గౌడపాలెం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో విషయం తెలుసుకున్న ఆ ప్రాంతంలోని మహిళలు, యువత దుకాణం వద్దకు చేరుకుని ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు వల్ల ఎంతో కాలంగా ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సిఐ రవితో పాటు వేమూరు సిఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళలకు సర్ది చెప్పే ప్రయత్నం చేయబోగా వారు మద్యం దుకాణం మూసి వేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఇక్కడ నుంచి వేరే చోట మద్యం దుకాణం తరలించాలంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సిఐలు చేసేదేమీ లేక వినతి పత్రం ఇస్తే మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని, ఆందోళన విరమించాలని కోరారు. వారి హామీతో ఆందోళన విరమించారు. అయితే సాయంత్రం మళ్లీ మద్యం దుకాణం తెరవడంతో విషయం తెలుసుకున్న మహిళలు దుకాణం వద్దకు వచ్చి షాపు మూయించి ఆందోళన చేయబోతుండగా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు షాపును మూయించి వేశారు. అయినా మహిళలు చాలా సేపు దుకాణం వద్దే ఉండి దుకాణం తెరిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు.

హేమనాగశ్రీకి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



హేమనాగశ్రీకి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న హేమనాగశ్రీ వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉండటంతో సమస్యను రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్ళటంతో ఆయన సీఎంఆర్ఎఫ్ఎల్‌వోసీ ద్వారా రూ.6 లక్షలు మంజూరు చేయించి బుధవారం చెక్కును అందించారు. శివప్రసాద్ మాట్లాడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న హేమనాగశ్రీకి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గోగినేని పట్టాభి రామారావు, నర్రా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్‌భూములు నిరుపేదలకు పంచాలి

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి విష్ణు

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతమైన అసైన్డ్‌భూములను తక్షణమే భూమిలేని నిరుపేదలకు పంచాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి ఎన్.విష్ణు డిమాండ్ చేశారు. అఖిలభారత రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా నాయకుడు బెజ్జం శ్రీనివాసరావు 6వ వర్ధంతి సభను బాపట్ల మండలం వెదుళ్ళపల్లి కొల్లా వెంకయ్యకాలనీలో బుధవారం నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి జె.కల్పన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కొల్లా వెంకయ్యకాలనీలో నివాసం ఉండే నిరుపేదలకు నివేశన స్థలాల పట్టాలిచ్చి మౌలికసదుపాయాలు కల్పించాలన్నారు. కర్లపాలెం రోడ్డులోని మాదాల నారాయణస్వామికాలనీలో నివాసం ఉండే నిరుపేదల ఇళ్ళకు విద్యుత్ సౌకర్యం, కొండుభొట్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని నల్లమడ డ్రైన్‌పై నివాసం ఉండే యానాదుల కుటుంబాలకు స్థలాలు కేటాయించాలన్నారు. సభలో అఖిల భారతరైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, నాయకులు ముప్పల రాఘవులు, ఎస్‌కె అజిత, ముప్పల పల్లవి, ఎంపీ రంజాన్, నాగూర్‌బి, మిక్కిలి చిన్న, బాజి, మరియమ్మ, బెజ్జం కమలాకర్, బెజ్జం రూతమ్మ తదితరులు పాల్గొని బెజ్జం శ్రీనివాసరావుకు ఘన నివాళులు అర్పించారు.

టెట్ రాసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అవకాశం కల్పించాలి

● సోషల్ వెల్ఫేర్ డీడీ రాజాదెబోరాకు వినతి

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : టెట్ రాసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కూడా ప్రభుత్వం ఉచిత శిక్షణ అవకాశం కల్పించాలని శ్రీ భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. ఈ విషయమై బుధవారం సోషల్‌వెల్ఫేర్ డీడీ జె.రాజదెబోరాను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్టోబరు నెలలో టెట్ రాసిన వారికి కూడా ఉచిత డీఎస్సీ శిక్షణ అందించి ఉద్యోగాలు పొందటానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ సెల్ కోఆర్డినేటర్ జబ్బీర్, శ్రీనివాసరావు, ప్రసన్నకుమారి, సుష్మిత, సత్యాబి, దిల్‌దార్ పాల్గొన్నారు.



వరద బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వరద బాధితులకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ

కొల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కిష్కిందపాలెంలో వరద బాధితులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బహుజన రీసోర్స్ సెంటర్ సంస్థ ద్వారా బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని వరద బాధితులకు చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ చూడని విధంగా వరదలు వచ్చాయని, ఆ సమయంలో అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. వరద అనంతరం గ్రామాల్లో పంటలు, ఇల్లు, ఇనిమిరేషన్ చేసి నష్ట పరిహారాన్ని వెంటనే అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్‌సీ ఛైర్మన్ అల్లడి దేవకుమార్, దేవపాల్, మండల అధ్యక్షుడు ఘైనేని మురళీకృష్ణ, సుంకర శ్రీను, బోయపాటి తేజ, నర్రా మధు, రావుల రమేష్, గ్రామ పెద్దలు, ప్రభుత్వ అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్తీకమాసం భక్తుల కోసం వసతులు కల్పించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసంలో సూర్యలంక సముద్రతీరానికి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి బుధవారం ఆయన సూర్యలంక సముద్రతీరంలో పర్యటించారు. తీరంలో ఎక్కడెక్కడ ఎలాంటి వసతులు కల్పించాలో అధికారులకు సూచించారు. భక్తులు, పర్యాటకుల రాకపోకలకు విఘాతం లేకుండా చూడాలని చెప్పారు. ముఖ్యంగా తాగునీరు, జల్లుస్నానం, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు వంటివి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు చెన్నుపాటి కిషోర్, తహసీల్దార్ షేక్ సలీమా, డీపీవో కేఎల్ ప్రభాకరరావు, ఎంపీడీవో బి.బాబురావు, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరంలో అధికారులు, నాయకులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రీసర్వేలో రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఆర్డీవో



పోతుమర్రులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

వేమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే జరిగిన గ్రామాలలో సంబంధించిన రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. మండలంలోని పోతుమర్రులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు ఆర్డీవో హాజరయ్యారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులతో మాట్లాడుతూ, రీసర్వే ద్వారా దశాబ్దాల కాలం నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సర్వే పూర్తి చేసిన ప్రాంతంలో సంబంధిత రైతులకు ఎలాంటి సమస్య ఉన్నప్పటికీ దానిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు రైతులు భూ యాజమానుల పేర్లు మార్పు చేయాలని అర్జీలు సమర్పించారు. తక్షణ పరిష్కారం కోసం వేమూరు తహసీల్దార్ సుశీలను ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, చెరుకుపల్లి గ్రామంలో జరిగిన గ్రామ సభలో రైతుల నుంచి 15 అర్జీలు అందాయన్నారు. వారిలో కొందరు తమ భూములను తిరిగి సర్వే చేయించాలని కోరారు. ఇద్దరు వ్యక్తుల అంగీకారంతో సర్వే జరిపి కొలతలలో తేడాలు లేకుండా సర్వే రాళ్లను వేయించి సహకరిస్తామన్నారు. చెరుకుపల్లి మండలంలో ఇంతవరకు జరిగిన రీసర్వే ద్వారా ప్రభుత్వానికి రెండు ఎకరాల మిగులు భూమి స్వాధీనం అయిందన్నారు. వేమూరు మండలంలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్టు ద్వారా రీసర్వే సంతృప్తికరంగా జరిగిందని, సర్వే అనంతరం భూములు కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఆన్‌లైన్ ద్వారా అర్జీలు దాఖలు చేసుకుంటే వాటి మంజూరుకు సహకరిస్తామన్నారు. సభలో వీఆర్వోలు, వీఏఎలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

● వేమూరు సీఐ ఆంజనేయులు

కొల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని వేమూరు సీఐ ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని అనంతవరంలో అనంతవరం, కొల్లూరు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ, విద్యార్థులకు సమస్యలు ఎదురైతే పోలీసులకు ఎలా సమాచారం ఇవ్వాలనే విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శివనాగిని, ఎఎన్ఎం, పిఎస్‌బి కుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్రవాహనాలు, స్పేర్‌పార్టులు అమ్మే దుకాణాలు

- సెకండ్ హ్యాండ్, స్పేర్ పార్టుల కాణాచి మాయాబజార్
- గుంటూరుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సముదాయం
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఓల్డ్ మోటార్ మార్కెట్
- చుట్టుపక్కల నాలుగు జిల్లాలకు అదే కేరాఫ్ అడ్రస్
- ఇక్కడ నుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన లాల్‌జాన్ భాషా

గుంటూరుకు మిర్చి ఘాటు ఎంత ప్రత్యేకమో.. మాయా బజార్ అంతే ప్రత్యేకం. ఎక్కడో దక్షిణాదిలోని ఒక నగరంలో వున్న ఈ ఓల్డ్ మోటార్ మార్కెట్.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందంటే నమ్ముతారా..? ఇక్కడ ప్రస్థానం మొదలు పెట్టి పార్లమెంటు స్థాయికి ఎదిగిన మహా నాయకులున్నారంటే ఔరా అనుకోరా? కానీ అదే నిజం! ఈ వాస్తవాలన్నీ ఒక ఎత్తయితే.. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ మార్కెట్ తనకదే ఎన్నో కథలు రచించుకుంది. ఎన్నో వదంతులకు ఆలవాలమయింది. ఎన్నెన్నో అపవాదులు మోసింది. మాయా బజార్ గురించి ఎవరికి వారు తమకు తోచిన కథ తాము చెప్పుకుంటూ పోతుంటారు.. కానీ అసలు కథ ఏంటన్నదే అసలు ప్రశ్న!

మాయా బజార్!

● చైన్ బ్యాచ్ రఫీ కాలంలో మహర్దశ

పది ఖార్ఖానాలతో మొదలైన ఓల్డ్ మోటార్ మార్కెట్ చైన్ బ్యాచ్ రఫీ హయాంలో మహర్దశకు చేరిందని చెబుతుంటారు. విద్యావంతుడైన ఆయన యువకులకు మార్కెట్‌లో పని కల్పిస్తూ మార్కెట్‌ను విస్తరించడానికి కృషి చేశాడని ప్రతీతి. దీంతో వేలాదిమంది యువకులకు అక్కడ ఉపాధి కల్పించేందుకు కృషి చేశారని చెబుతుంటారు. ఫలితంగా పది ఖార్ఖానాలతో మొదలైన మార్కెట్ ఆ తరువాత 200 షాపులకు విస్తరించింది. అక్కడ రిపేరు చేయని కార్లు, లారీలు, వాహనాలు, దొరకని స్పేర్ పార్ట్‌లు ఉండేవి కావంటే అతిశయోక్తి కాకపోవచ్చు. మెర్సిడెస్ బెంజ్ కారు మొదలు మారుతీ కారు వరకూ, అశోక్ లేలాండ్ భారీ వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్టులు, రిపేర్లు సహా అన్నీ అక్కడ దొరికేవి. గుంటూరు ఓల్డ్ మార్కెట్‌కు వస్తే మాయ చేసి మంత్రం వేసినట్లు ఎలాంటి సమస్య అయినా ఇట్టే పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో చాలా మంది మార్కెట్‌ను వాడుక భాషలో మాయా బజార్ అనుకునేవారు. ఆ విధంగా అది కాలక్రమంలో 'మాయాబజార్'గా రూపాంతరం చెందింది. ఆ తరువాత విస్తరణకు అవకాశం లేకపోవడం మార్కెట్‌కు మార్కెట్‌కు శాపంగా మారింది.

గుంటూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాయా బజార్‌కు వందేళ్ల చరిత్ర ఉంది. వందేళ్ల క్రితం బ్రిటీష్ పాలనలో ఇప్పుడున్న పల్నాడు బస్టాండు ప్రాంతంలో ఈ ఓల్డ్ మోటార్ మార్కెట్ పురుడు పోసుకుంది. పది మంది మోటార్ మెకానిక్కులు ఖార్ఖానాలు పెట్టుకుని కార్లు, లారీలు ఇతర మోటార్ వాహనాలకు రిపేర్లు చేసేవారు. జాతీయోద్యమకాలంలో ఈ మెకానిక్ ఖార్ఖానాలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం దాన్ని ప్రస్తుతం వున్న గుంటూరు పాత బస్టాండు ప్రాంతానికి తరలించారు. విశాలమైన ప్రాంతం వుండడంతో ఖార్ఖానాలు దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందాయి. అప్పట్లో ప్రతిష్టాత్మకమైన రోల్స్ రాయిస్, ఫోర్డ్ కార్లు, డాడ్జ్ లారీలకు రిపేర్లు చేయగల స్థాయి మెకానిక్కులు, ఖార్ఖానాలు ఇక్కడే ఉండేవి. జాతీయోద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా ఈ మార్కెట్‌కు లాల్ బహదూర్ ఓల్డ్ మోటార్ మార్కెట్ అని పేరు పెట్టుకున్నారు. అదే విలువలతో ఖార్ఖానాలు నడిపారు. మద్యం సేవించి ఖార్ఖానాల్లోకి రావడం, మార్కెట్ ప్రాంగణంలో అడుగు పెట్టాక పొగ తాగడం నేరాలుగా భావించేవారు. అలా వస్తే వారి నోటి నిండా తేనే పోసి వెగటు పుట్టేలాగా చేసి అలవాట్లు మాన్పించేవారని పాత తరం వారు చెబుతున్నారు. పెద్దలను గౌరవించకపోతే శిక్షలు కఠినంగా ఉండేవని చెబుతున్నారు. ఇలా ఈ సంస్కృతి దాదాపు 7 దశాబ్దాలపాటు కొనసాగించారంటే అతిశయోక్తి కాదు.

● ఆటోనగర్‌కు విస్తరణ

నగరం నడిబొడ్డున ఉండడంతో విస్తరించే అవకాశం లేకపోవడంతో చాలా షాపులు ఆటో నగర్‌కు వెళ్లిపోయాయి. అక్కడ జాతీయ స్థాయిలో వ్యాపారాలు జరగుతున్నాయి. ఢిల్లీ నగరం నుంచి వేలాది వాహనాల స్పేర్ పార్టులు ఇక్కడికి వస్తున్నాయి. తాజా అంచనాల ప్రకారం ప్రతి ఏటా ఒక్క ఢిల్లీతోనే 100 కోట్ల టర్నోవర్ నడుస్తోందని చెబుతున్నారు. 1990ల్లో జిల్లా కలెక్టర్‌గా వచ్చిన జన్నత్ హుస్సేన్ మాయాబజార్‌ను ఆటో నగర్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. కార్లు, లారీల వంటి భారీ వాహన ఖార్ఖానాలు ఆటోనగర్ తరలిపోవడంతో ప్రస్తుతం మోటార్ సైకిల్, ఆటోల ఖార్ఖానాలు మాత్రమే అక్కడ మిగిలాయి. గత రెండు, మూడు దశాబ్దాల్లో ఓల్డ్ మోటార్ మార్కెట్ ప్రభ కొంత మేరకు తగ్గిందనే చెప్పాలి. పాత తరం స్థానే వచ్చిన కొత్త తరం ఆనాటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలూ లేకపోలేదు. అయినప్పటికీ ఇప్పటికీ ఈ చుట్టుపక్కల ఉన్న నాలుగైదు జిల్లాలకు సెకెండ్ హ్యాండ్ అవసరాలను తీరుస్తోంది. వేల మందికి ఉపాధి కల్పిస్తోంది.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళిగా మాయా బజార్ ముఖద్వారం



● ఇక్కడి నుంచి పార్లమెంటుకు

గుంటూరు ఓల్డ్ మోటార్ మార్కెట్ వాహనదారుల అవసరాలు తీర్చడమే కాదు.. జాతీయ స్థాయి నాయకత్వాన్ని కూడా అందించింది. ఇక్కడ స్పేర్ పార్టుల ఖార్ఖానా నడిపిన లాల్‌జాన్ భాషా టీడీపీ తరుపున చట్ట సభల్లో కాలు పెట్టారు. భారత పార్లమెంటులో తన గళం వినిపించారు. భువనేశ్వర్, కోల్‌కతా నుంచి పనికి రాని వాహనాల విడి భాగాలను తరలించి అతిపెద్ద మార్కెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆ పునాదులతోనే ఆయన రాజకీయంగా ఎదిగారు. పార్లమెంటులో అడుగుపెట్టి మార్కెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. ఆ తరువాతి కాలంలో మార్కెట్ బాగా విస్తరించింది.

సహన మృతి బాధాకరం

కుటుంబానికి రూ.10లక్షలు ఆర్థికసాయం

ఇలాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరిస్తాం

24గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాం

బాధలో ఉంటే ధైర్యం చెప్పాలి.. రాజకీయాలు తగదు

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్

తెనాలి మారీసుపేట,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థాయిలో నిలవాల్సిన సహన(25) బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబసభ్యులకు ప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ అన్నారు. తెనాలి ఐతానగర్‌కు చెందిన సహన (25) కొల్లిపరమండలం వల్లభాపురానికి చెందిన నవీన్‌కి మధ్య జరిగిన ఘటనలో బ్రెయిన్ డెడ్‌తో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బుధవారం తెనాలిలోని ఐతానగర్‌కు తీసుకువచ్చారు. మంత్రి మనోహర్ సహన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు.

కుటుంబసభ్యలకు ధైర్యం చెప్పి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.10లక్షల చెక్కును ప్రభుత్వం తరుపున అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిమనోహర్ మాట్లాడుతూ అల్లారు ముద్దుగా పెంచిన కుమార్తె అనుకోని సంఘటనతో మృతి చెందితే ఆ తల్లిదండ్రులు పడే ఆవేధన వర్ణణాతీతమన్నారు. అటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. కాని ప్రతిపక్షపార్టీ మాత్రం అందుకు భిన్నంగా రాజకీయం చేసేందుకు రావడం బాధాకరమన్నారు. ఆడబిడ్డ బ్రెయిన్ డెడ్‌తో మృతి చెంది ఆ కుటుంబసభ్యులకు తీరని సోకాన్ని మిగిల్చిందన్న ఆలోచన లేకుండా ఇష్టానుసారం మాట్లాడటం సరైన విధానం కాదన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు చేయాల్సిన మంచి పనులపై మాట్లాడితే స్వాగతిస్తామన్నారు. 5ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి తాడేపల్లి ప్యాలెస్ సాక్షిగా చేసిన ఘటనలను ప్రజలు మరవలేదని రాజకీయాలకు ఆడబిడ్డలను అడ్డుపెట్టుకోవడం సంస్కారం కాదని హితవు పలికారు. రాష్ట్ర వ్యాప్తంగా లా అండ్ ఆర్డర్ అమల్లో ఎక్కడా కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించేది లేదన్నారు. ఘటన జరిగిన 24గంటల్లోనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడని చెప్పారు. సహన కుటుంబసభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సహన అంత్యక్రియలు పూర్తి

సహన అంత్యక్రియలు కుటుంబసభ్యులు బుధవారం పూర్తి చేశారు. సహన మృతదేహం వద్ద కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆమెతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుని ఆవేదనకు లోనయ్యారు. క్రిష్టియన్ మతాచారం ప్రకారం ఆమె అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు.

గ్రీన్‌గ్రేస్ భవన సముదాయం ప్రజలకు సంబంధం లేదా...?

ఆర్‌టీఐ కింద సమాచారం కోరితే రైల్వే సమాధానం ● ఏడీఆర్‌ఎం వద్ద అప్పీల్‌కు వెళ్లేందుకు సిద్ధమైన అర్జీదారుడు

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నల్లపాడు రైల్వేసెక్షన్‌లో రైలుపట్టాలకు అతి సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ భవన సముదాయం విషయంలో రైల్వే శాఖపరంగా తీసుకొన్న చర్యలపై సమాచారం ఇచ్చేందుకు ఆ శాఖ ఇష్టపడటం లేదు. ఇది ప్రజలకు సంబంధం లేదని పేర్కొంటూ సమాచార హక్కు చట్టం కింద పెట్టిన అర్జీని తిరస్కరించింది. జీ+16 భవన సముదాయం నిర్మాణ దశలో రైలుపట్టాలపైకి ఒరిగితే ఆ సమయంలో పెద్ద ప్రమాదమే తలెత్తే అవకాశం ఉన్నది. అదే జరిగితే వందల సంఖ్యలో ప్రయాణీకుల ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. మరోవైపు రైలుపట్టాలు కుంగిపోయినా రైలు ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉన్నది. ఇది ప్రజలకు సంబంధించిన అంశం అయినప్పటికీ రైల్వే శాఖ సమాచారం ఇవ్వకపోతుండటంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

నగరంలోని పట్టాభిపురంలో ఉన్న రైల్ వికాస్ భవన్‌కి అతి సమీపంలోనే వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ గ్రీన్‌గ్రేస్ పేరుతో భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. జీ+5 అపార్టుమెంట్ నిర్మాణం పేరుతో ప్లాన్, రైల్వే శాఖ ఎన్‌వోసీ తీసుకొని అందుకు విరుద్ధంగా జీ+16 భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఈ అక్రమంపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ గొంతు విప్పడంతో నగరపాలకసంస్థ, రైల్వే, విజిలెన్స్, పొల్యూష్యన్ కంట్రోల్ బోర్డు తదితర శాఖలు రంగంలోకి దిగాయి. ఎట్టకేలకు భవన సముదాయం నిర్మాణాన్ని నిలుపుదల చేయించాయి. కాగా రైల్వే శాఖ నిర్లక్ష్యంపై సమాచార హక్కు చట్టం కింద ఒక ఉద్యమకారుడు అర్జీ పెట్టారు. 2023లో ఎన్‌వోసీ రద్దు అయినట్లే భావించాలని పేర్కొంటూ భవన నిర్మాణాలను నిలుపుదల చేయించాలని రైల్వే శాఖ మునిసిపల్ కార్పొరేషన్‌కు లేఖ రాసింది. అయితే కార్పొరేషన్ స్పందించకపోతే రైల్వే శాఖ ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు, చీఫ్ సెక్రెటరీకి నివేదించాలి. వారు కూడా స్పందించకపోతే దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్‌కు నివేదించి కేంద్ర ప్రభుత్వపరంగా చర్యలు తీసుకొనేందుకు విజ్ఞప్తి చేయాలి.

రైల్వే శాఖ తీసుకొన్న చర్యల గురించి ఆర్‌టీఐ ఉద్యమకారుడు సమాచారం కోరితే ఇది ప్రజలతో సంబంధం లేనందున మీ అర్జీని ఫలాన సెక్షన్ కింద తిరస్కరిస్తున్నామని గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన ఒక అధికారి సమాధానం ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని ఆ వ్యక్తి అప్పిలేట్ అథారిటీ అయిన ఏడీఆర్‌ఎంకు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించారు. ఒకవేళ ఏడీఆర్‌ఎం కూడా అర్జీని తిరస్కరిస్తే సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ కోర్టులో పిటీషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

వరద నష్టం అక్రమాలపై ముగిసిన విచారణ

రూ 17.5 లక్షల సొమ్మును తిరిగి చెల్లించిన నకిలీ రైతులు

మేడికొండూరు అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత నెలలో సంభవించిన వరదల కారణంగా మేడికొండూరు మండలంలోని పలు గ్రామాలలోని రైతులకు పంట నష్టం పరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. పంట నష్టం పరిహారం పొందిన వారిలో అనేక మంది వ్యవసాయం చేయనివారు ఉండడంతో ఆరా తీయగా అక్రమాలు బయట పడ్డాయి. దీనిపై పంట నష్టం పరిహారం స్వాహా పేరిట ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. గత వారం రోజులుగా కొనసాగిన విచారణ బుధవారం ముగిసింది. ఇప్పటి వరకు వరద నష్టం జాబితాలో ఉన్న వారు తాము వ్యవసాయం చేయలేదని తమ ఖాతాలో ఎలా పడ్డాయో తెలియదంటూ 17లక్షల 50వేల రూపాయలను విచారణ అధికారులకు చెల్లించారు. జరిగిన విచారణ నివేదికను జిల్లా ఉన్నతాదికారులకు నివేదిస్తామని విచారణ అధికారులు తెలిపారు.

సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదకు మేడికొండూరు మండలంలోని 8 గ్రామాలలో సుమారు 220 హెక్టార్లలో ప్రత్తి పంట దెబ్బతింది. 33శాతానికి మించి పంట నష్టం జరిగిందని స్థానిక అధికారులు జాబితా అందజేశారు. దాని ప్రకారం పంట నష్టపరిహారం క్రింద 3కోట్ల 75లక్షల రూపాయల ప్రభుత్వం రైతులకు అందజేసింది. నష్టం పరిహారం పొందిన 5వందల మందిలో భూ యాజమానులతో పాటు కౌలు రైతులు కూడా ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది రైతులు కాదని తేలింది. ఈ జాబితాను ఆన్‌లైన్ చేసే సమయంలో కొందరు వ్యవసాయశాఖ సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించారు. ఒక ప్రవేటు వ్యాపారి, గ్రామ వ్యవసాయ సహాయకుడు (విఏఓ) కుమ్మక్కై వ్యవసాయం చేయని వారిని జాబితాలో చేర్చి వారిపేరట బ్యాంకు ఖాతాలో పడిన సొమ్మును వేర్వేరు కాణాలు చెప్పి డ్రాచేయించి స్వాహా చేశారు. విచారణ ప్రారంభం కాగానే అక్రమాలకు పాల్పడిన వారు అప్రమత్తమై తాము స్వాహా చేసిన సొమ్మును జాబితాలో ఉన్నవారికి ఇచ్చి తమ బ్యాంక్ ఖాతాలో ఎలా పడ్డాయో తెలియదని అధికారులకు చెల్లించమని ప్రాధేయపడ్డారు. మండలంలో వరదలు వచ్చినా పంట నష్టం అంతగా లేదని కొద్ది మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లిందని అధికారుల పరిశీలనలో తేలింది. అంతేకాకుండా వ్యవసాయం చేయని వారి పేర్లు పంట నష్టం జాబితాలోకి ఎలా వచ్చాయి. వారికి కౌలు రైతు కార్డులు ఎలా ఇచ్చారు అనే విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది. జాబితా తయారీలో పాల్గొన్న అధికారుల నుంచి కూడా వివరణ తీసుకున్నామని విచారణ లో పాల్గొన్న అధికారులు వివరించారు.

హాస్టల్ గదిలో 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) గుంటూరు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం వద్ద గల ఓ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలో ఎనిమిదో తరగతి చదువుతున్న కరణం పద్మసుధ (13) అనే విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నల్లపాడు సీఐ వంశీధర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేటకు చెందిన కరణం అనిల్ కుమార్, పావని దంపతులకు మహవీర్ (16), పద్మ సుధ (13) సంతానం ఉన్నారు. మహవీర్ నర్సరావుపేటలోని ప్రైవేట్ స్కూల్లో చదువుతుండగా, పద్మసుధ గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం లోని ఓ కార్పొరేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చింది. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రి సుమారు 8. 30 గంటల సమయంలో తోటి విద్యార్థులు స్టడీ అవర్ లో ఉన్న సమయంలో ఆమె హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన వార్డెన్, సిబ్బంది , ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. అయితే పద్మసుధ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులకు ధృవీకరించారు వెంటనే వార్డెన్ చిలకలూరిపేటలో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు నల్లపాడు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే తమ కుమార్తె మృతిపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు బుధవారం ఉదయం స్కూల్ ఎదుట మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇంటిపై బెంగతోనే ఆత్మహత్య చేసుకుందని హాస్టల్ సిబ్బంది వాపోయారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

ఎస్పీఎఫ్ అంటేనే ఒక ధీమా



కార్యక్రమంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, వేదిక పైన పోలీసు ఉన్నతాధికారులు త్రివిక్రమ వర్మ, బీవీ రామిరెడ్డి తదితరులు

రాష్ట్ర హోం మంత్రిగా పనిచేయడం నా పూర్వజన్మ సుకృతం

ఏపీఎస్పీఎఫ్ 33వ వార్షిక క్రీడల్లో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత



పోలీస్ అధికారులు, సిబ్బందితో గ్రూప్ ఫోటోలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

పెదకాకాని, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీసు వ్యవస్థ అంటే ఒక భయం ఉండేదని, నేడు ఆ భయం వీడి భద్రత వైపు సమాజం నడుస్తుందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్పీఎఫ్) 33వ వార్షిక క్రీడల ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా పాలొన్నారు. రోజువారి విధులనుంచి బయటకు వచ్చి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ విధి అంటేనే 24/7 అనే నినాదం ఉంటుందని ప్రజల, ప్రభుత్వాల, ధన, మాన, ప్రాణాలు రక్షించడమే ధ్యేయంగా పనిచేస్తారన్నారు. పోలీస్ వ్యవస్థ ఒత్తిడితో కూడుకున్న వ్యవస్థగా ఉంటుందని నేటి తరం పోలీసులు బాధ్యతగా నిలిచి విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. హోంగార్డు నుంచి ఐపీఎస్ వరకు ప్రతి వ్యవస్థలో, ప్రతి హోదాలో వారి వారి శ్రమ అనిర్వచనీయమని పేర్కొన్నారు.

వారి ఓపికకు సలాం అంటూ కితాబిచ్చారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అంటేనే ఒక గౌరవం ఉందని ఈ సందర్భంగా అనిత పేర్కొన్నారు. ఈమధ్య విజయవాడకు వచ్చిన వరదలకు ఎస్పీఎఫ్ వ్యవస్థ నిరంతరం నిద్రాహారాలు మాని శ్రమించారన్నారు . ప్రజల ప్రాణాలను కాపాడటంలో వారు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. హోంశాఖ మంత్రిగా విధులు నిర్వహించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని ఇందులోకి మహిళలను కూడా తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. వీరికి సంబంధించి శాశ్వత భవనాల ఏర్పాటు, శిక్షణ ప్రాంతాలకు సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పోలీసు వ్యవస్థను గౌరవంగా భావిస్తారని ఆయన సహకారం తో పోలీసు వ్యవస్థకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీలు డాక్టర్ త్రివిక్రమ్ వర్మ, రామిరెడ్డి, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కే గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండలో నగరవనం పార్కు



ఆహ్లాదం.. వినోదం.. సాహసం

కోటప్పకొండలో ఆకట్టుకుంటున్న నగర వనం

రూ 1.40 కోట్లతో ఏర్పాటు చేసిన అటవీశాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రఖ్యాత శైవ క్షేత్రం.. పర్యాటక కేంద్రం కోటప్పకొండలో ఏర్పాటు చేసిన నగరవనం యాత్రికులను ఆకట్టుకుంటోంది. ఆహ్లాదం.. సాహసం.. వినోదం కలగలపి నగరవనం నిర్మించారు. తాటి కలపతో నిర్మిచిన స్వాగత ద్వారం, పూరి గుడిసెలు ఆకర్షిస్తున్నాయి. కోటప్పకొండ గిరి ప్రదిక్షణ మార్గంలో నగరవనం.. గిరివన విహార్.. గిరి బాల విహార్ పేర్లతో ఉద్యానవనాలు రూపుదిద్దుకున్నాయి. కొండ వెనక ప్రాంతంలో పండ్ల.. పూల మొక్కలతో వనాలను పెంచుతున్నారు. అటవీ శాఖ అధ్వర్యంలో ఈ వనాలు రూపుదిద్దుకున్నాయి. వీటని కేంద్రియ నగర వన యోజన పథకం కింద అటవీ శాఖ చేపట్టింది. రూ 1.40 కోట్ల వ్యయం చేస్తున్నారు. పంచతత్వ పేరుతో నరకదారి నిర్మిచారు. చిన్నారుల కోసం ఆట వస్తులతో ప్రత్యేక పార్కు.. సాహసక్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. పెట్లూరివారిపాలెం - కోటప్పకొండ మార్గంలో నగరవనం రూపుదిద్దుకుంది. నగరవనం, గిరి బాలవి హార్, గిరి వనవిహార్‌లను త్వరలో ప్రారంభించేందుకు ఆటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. వనాల్లోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ప్రవేశ రుసుము రూ 20 వసూలు చేస్తున్నారు.



నగరవనంలో చిల్డ్రన్స్ పార్కు



గుడిసె



సాహసక్రీడా ప్రాంగణం

కటకటాల్లోకి కిరాతక ప్రియుడు

» ఒంగోలు జైలుకు తరలింపు

» 24 గంటల్లో కేసును ఛేదించిన సీఐ


నిందితుడిని అదుపులోకి తీసుకున్న సీఐ

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వివాహిత నాగండ్ల మేరీని హత్య చేసిన ప్రియుడు కండె వరప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు బుధవారం సీఐ ఎం. శేషగిరిరావు విలేకరులకు తెలిపారు. మండలంలోని డేగరమూడిలో ఈ నెల 20న మేరీ హత్యకు గురైన విషయం తెలిసిందే. హంతకుడు వర ప్రసాద్‌తోపాటు హత్యకు ఉపయోగించిన కత్తి, స్కూటీ, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మంగళవారం సాయంత్రం మేదరమెట్ల నుంచి తమ్మవరం వెళ్లే రోడ్డులో బస్‌షెల్టర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారన్నారు. బుధవారం నిందితుడ్ని అద్దంకి కోర్టులో హాజరుపరచగా, ఒంగోలు జైలుకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కాగా హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, పీవీ సుబ్బారావు, గరుత్మంతుడు, పీసీ రమేష్ కృషి చేశారు. 24 గంటల్లో కేసు ఛేదించిన సీఐని ఉన్నతాధికారులు అభినందించారు.

మహిళపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

మంగళవారం రాత్రి మరో మహిళతో గొడవ పడిన బాధితురాలు

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మహిళపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు చీరాల ఏరియా హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల మండలం రామకృష్ణాపురం సింగ్ డాబా వెనుక షేక్ ఖాదర్‌బీ ఉంటోంది. ఇదే ప్రాంతంలో గతంలో దివ్య, పద్మ నివసించేవారు. ఈక్రమంలో వీరితో ఖాదర్‌బీకు వివాదాలు ఉన్నాయి. మంగళవారం రాత్రి గొడవ జరిగింది. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఈమెపై దాడి చేయగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు, కుటుంబ సభ్యులు 108 ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

జామచెట్టుపై నుంచి పడి తండ్రి మృతి

» రెండేళ్ల కిందట అనారోగ్యంతో అన్న, ఏడాది కిందట తల్లి మృతి

» ఒంటరయ్యానని బోరున విలపిస్తున్న చిన్న కుమారుడు

దేవాంగపురి(చీరాలటౌన్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమ్మా, అన్న చనిపోయారు. ఇప్పుడు నువ్వూ నన్ను విడిచివెళ్లావా నాన్నా.. నాకు దిక్కెవరంటూ కుమారుడు హాస్పిటల్ వద్ద బోరున విలపించాడు. ఈ హృదయవిదారక సంఘటన బుధవారం చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ హస్తినాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పృధివి బాల సుబ్రహ్మణ్యం (65), వెంకట సుబ్బమ్మ దంపతులు. వీరిది చేనేత కుటుంబం. ఎంతో ఆనందంగా ఉండే వీరి జీవితంలో అనుకోని రీతిలో గత రెండేళ్ల కిందట పెద్ద కుమారుడు మృతి చెందాడు. దీంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఏడాది క్రితం అనారోగ్యంతో తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి వయోప్రాయంలో ఉన్న తండ్రికి ఆలనాపాలన చిన్న కుమారుడు సుబ్బారావు చేసుకుంటున్నాడు. దురదృష్టం వీరిని వెంటాడింది. బుధవారం సాయంత్రం ఇంటిముందు ఉన్న జామ చెట్టుకున్న కాయలు కోసేందుకు నిచ్చెన వేసుకుని తండ్రి బాల సుబ్రహ్మణ్యం చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడి తలకు బండ రాయి తగిలింది. పక్కనే పనిచేస్తున్న బేల్దారీలు వెంటనే చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. అన్న, అమ్మ, ఇప్పుడు నాన్న మృతిచెందడంతో సుబ్బారావు హాస్పిటల్ వద్ద కుప్పకూలి బోరున విలపించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద టీవీఎస్ మోపెడ్ పై వెళుతున్న పాలపర్తి బాలకృష్ణ అనే వ్యక్తిని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బాలకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సమాచారం అందడంతో వెంటనే హైవే అంబులెన్సు వారు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలకృష్ణ టోల్‌ప్లాజా వద్ద ఎన్16 హోటల్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన అతను విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

చెక్ డ్యాంలో మొసలి సంచారం

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుగారిపాలెం వాగులో మొసలి కనిపించినట్లు గ్రామ రైతులు చెప్తున్నారు. ఈ వాగుపై గ్రామ సమీపంలో ఉన్న చెక్ డ్యాంలో ఆదివారం సాయంత్రం పొలాలకు మోటారు ద్వారా నీళ్లు పెట్టుకోవడానికి వెళ్లిన రైతులకు మొసలి కనిపించడంతో గ్రామంలో చర్చించుకుంటున్నారు. దాంతో గ్రామస్థులు చెక్ డ్యాం వైపు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా బుధవారం సాయంత్రం శ్రీనివాసరావు అనే రైతు చెక్ డ్యాం దగ్గరకు వెళ్లగా అతనికి కూడా నీటిలో మొసలి కనిపించినట్లు తెలిసింది. విషయాన్ని మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు సీఐ శేషగిరిరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రమేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం చెక్ డ్యాం వద్దకు వచ్చి మొసలిని పట్టుకుంటామని, అప్పటివరకు గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మార్టూరు హెల్ప్ ఔట్రిచ్ వర్కర్ కే దుర్గ అన్నారు. ప్రభుత్వం 2030 నాటికి రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాధిని పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో ఎనిమిది అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ ఆధ్వర్యంలో జొన్నతాళి గ్రామంలో పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రూతు, సల్మా, ప్రమీల, రమ్య, సరోజిని, అంగనవాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో న్యూట్రీ గార్డెన్

అద్దంకిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో న్యూట్రీ గార్డెన్‌లలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు సీడీపీవో ఏ.కృష్ణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద న్యూట్రీ గార్డెన్‌లో భాగంగా మొక్కలు నాటారు. కొరిశపాడు ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాలల్లో 11 న్యూట్రీ గార్డెన్‌లు మంజూరైనట్లు కృష్ణకుమారి తెలిపారు. న్యూట్రీ గార్డెన్‌లో పండిన ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు వంటివి తల్లులకు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిర, రమాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు డీసీఆర్ఎంలో జాబ్ మేళా

ఇంకొల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంకొల్లు డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 25 శుక్రవారం ఉదయం 9 గంటలకు గంగవరం రోడ్డులోని డీసీఆర్ఎం డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18-32 వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ పాస్‌పోర్టు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 6302764962 నంబర్‌కు సంప్రదించాలన్నారు. జాబ్ మేళాను యువతీయువులు సద్వినియోగం చేసుకోవాలని దగ్గుబాటి విద్యా సంస్థల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు కోరారు.

రెవెన్యూ సభలతో భూ సమస్యల పరిష్కారం

పర్చూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో భూసర్వే పూర్తి అయి, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తిన వాటిని సత్వరమే పరిష్కరించాలన్న సంకల్పంతో సభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎండీ అల్తాఫ్, మండల సర్వేయర్ బాలాంజేయులు, ఆర్ఐ ఇన్‌చార్జి ప్రేమ్ కుమార్, ఉపసర్పంచ్ అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. గొనసపూడి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామ సభను నిర్వహించారు. సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. జాయింట్ ఫీల్డ్ విభజనకు 22, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసంపై 71, పట్టాదారు నమోదుకు 5, పేరు దిద్దుబాటుకు 7 అర్జీలను రైతులు అందజేశారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాల ఖోఖో జట్ల ఎంపిక


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 14 బాలుర ఖోఖో జట్టు


అండర్ - 14 బాలికల జట్టు

బాల, బాలికల వివరాలు ప్రకటించిన రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి

పంగులూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక బుధవారం పంగులూరులో జరిగింది. ఈ ఎంపికలో జిల్లా నలుమూలల నుంచి 200 మంది బాలురు, 150 మంది బాలికలు పాల్గొన్నారు. పంగులూరు ఎంఎస్ఆర్, అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో అండర్ - 14 బాల, బాలికలు, అండర్-17 బాల, బాలికల ఖోఖో జిల్లా జట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి, పీడీలు హనుమంతరావు, రఘుబాబు, పీఈటీలు సావిత్రమ్మ, రమాదేవి, ఖోఖో జిల్లా కోచ్ లక్ష్మీనారాయనరెడ్డి స్కూల్‌గేమ్స్ కార్యదర్శి హజీరా బేగం పాల్గొన్నారు.

ఎంపికైన ఖోఖో జట్లు

అండర్ - 14 బాలుర జట్టులో పి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్, వి.సాగర్ (పంగులూరు), కె.విష్ణు, జి.సందీప్, కె.వెంకటసాయి, ఎస్.విశ్వనాథకుమార్, సీహెచ్ మనోహరరెడ్డి, హేమంత్‌కుమార్ (కేవీపల్లి), కె.సుమంత్, ఎస్.ఆనందబాబు (బేస్తవారపేట), లక్ష్మీనరసింహ (గుడ్లూరు), ఎం.మణికంఠ (వైదన), పి.శాంతికుమార్ (మార్టూరు), శివశంకర్ (వేటపాలెం)పూర్ణచంద్రరావు (ఈదర), విశ్వనాథ్ (చీరాల), కె.ఆంజనేయులు (ఎస్ఎన్‌పాడు).

అండర్-14 బాలకల జట్టుకు ఎ.మేమలత, ఎ.నందిని, నీలిమ, గురవమ్మ (పాతపాడు), టి.బాల బార్గవి, ఎ.వైశాలి (ఎస్ఎన్‌పాడు), శ్రీలక్ష్మి (గుడ్లూరు), వి.పల్లవి, వర్షిని, అక్షయశ్రీ నాగమహిత, జి.మాధురి (కేవీపల్లి), పి.స్వాతి, ఎన్.వైష్ణవి (గణపవరం), ఎం.అణిత (ఈదర) ఎంపికయ్యారు.

అండర్-17 బాలుర జట్టుకు పి.నవీన్, డి.వినయ్, ఎం.సాగర్‌నాయక్, పి.నరేష్, సీహెచ్ నాగవర్ధన్, ఎస్‌డీ నవనాజ్, ఎం.అక్షయ్‌కుమార్ (పంగులూరు), టి.మనోజ్, ఎస్.రఘుపతి, ఎ.నవనీత్‌కుమార్, నందకిషోర్ (కేవీపల్లి), డి.అభిలాష్ (రుద్రవరం), ఎం.ఆంజనేయులు (సుంకేసుల), బి.రంగస్వామి బి.వెంకటరవీంద్ర (బి.పేట), అనిల్‌కుమార్‌నాయక్, పి.మంత్రానాయక్ (గిద్దలూరు), వి.నారాయణ (ఈదర), గోపీ కృష్ణారెడ్డి(పెదారవీడు) ఎంపికయ్యారు.


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 17 బాలుర జట్టు


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 17 బాలికల ఖోఖో జట్టు

అండర్ బాలికల జట్టుకు బి.కల్యాణి, కె.వైష్ణవి, ఎం.నాగేశ్వరి, ఎస్.భానుప్రియ, ఎ.నందినిరెడ్డి, ఎనస్వని, ఎల్.లలితేశ్వరి, జి.పావని (కేవీపల్లి), లక్ష్మీప్రసన్న, మానశ్రీ (మొగల్లూరు), డి.హేమశ్రీ (కోళ్లపూడి), ఎస్.కృష్ణసరిత, వెంకటరాజిత (గణపవరం), ఎ.పవాంగ్ (పాతపాడు), జి.రవికుమారి (ఈదర), స్నేహతిరుమల (కేజీబీవీ) ఎంపికయ్యారని రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికయిన క్రీడా జట్లను కళాశాల ప్రిన్సిపాల్ ఉషారెడ్డి, ఏడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్ రోటరీ ప్రతినిధులు వీరరాఘవయ్య, రాయిణి సుబ్బారావు, వై.శీనయ్య, పోలినేని కోటేశ్వరరావు, దామోదరరెడ్డి, గురవమ్మ అభినందించారు.

పర్చూరులో ప్రజాదర్బార్

» ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో రేపటి నుంచి నిర్వహణ

» సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం

పర్చూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి వినూత్న కార్యక్రమానికి స్వీకారం చుట్టాడు. ఈనెల 25న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బుధవారం ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ కొనసాగనుంది. ఇందులో రెవెన్యూ పంచాయతీ, హౌసింగ్, అగ్రికల్చర్, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, గ్రామీణాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ అధికారులతోపాటు, ఆయా శాఖల అధికారుల పాల్గొంటున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించేలా ప్రజాదర్బార్‌ను రూపకల్పన చేశారు. తహసీల్దార్ ఎంపీడీవో, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఇతర శాఖల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టనున్నారు.


ఫోన్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలిస్తున్న డా.వరుణ్ విజయ్ గైకీ

ఇదేమి విజిటింగ్ సారూ

» చీరాల ఏరియా హాస్పిటల్‌ను తనిఖీ చేసిన సెంట్రల్ ఆరోగ్య కేంద్రం ప్రతినిధి

» ఫోన్‌లో మాట్లాడుతూనే రికార్డుల పరిశీలన

» మీడియాకు వెల్లడించని వివరాలు

» ఎందుకొచ్చారంటూ నవ్వుకున్న జనం

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఆరోగ్య కేంద్రం, కుటుంబ సంక్షేమ ప్రాంతీయ కార్యాలయ నిపుణుడు డా.వరుణ్ విజయ్ గైకీ హైదరాబాద్ నుంచి బుధవారం చీరాల ఏరియా హాస్పిటల్లో విజిటింగ్ నిర్వహించారు. అయితే వచ్చినప్పటి నుంచి ఆసుపత్రి ఓపీ, వార్డులు, రక్త నిల్వలు తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. కానీ వీటిల్లో అర్ధభాగం ఫోన్‌లో మాట్లాడుతూనే పూర్తి చేశారు. మిగిలిన సగభాగం హాస్పిటల్ మొత్తం తిరగడానికే సరిపోయింది. ఎట్టకేలకు అధికారి వచ్చారు. విజిటింగ్ ముగిసిందన్న అనుభవం మాత్రమే హాస్పిటల్ సిబ్బందికి మిగిలింది. హాస్పిటల్ సమస్యలను రాత పూర్వకంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అందజేశారు. అసలు ఏమి పరిశీలన చేశారో అని అడిగిన మీడియా వారికి కూడా కనీసం ఏ సమాధానం చెప్పకుండా కారులో వెళ్లిపోయారు. ఉన్న సమస్యలు, ఏం అవసరాలు ఉన్నాయో రేపు ఈయనేమి నివేదిక ఇస్తారో ఎవ్వరికీ అర్థం కాలేదు. అసలు ఇదేమి తనిఖీ అని, అసలాయన ఎందుకు వచ్చారని జనం నవ్వుకున్నారు.

సేవల్లో అందెవేసిన చేతులు

» దాతృత్వ కార్యక్రమాల్లో ముందుంటున్న వాసవీ క్లబ్


అల్పాహారం, పండ్లు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న వాసవీ ప్రతినిధులు (ఫైల్)

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ చీరాల వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరి మన్ననలూ పొందుతున్నాయి. సేవల్లో అది అందివేసి చేయిగా పలువురు కొనియాడుతున్నారు. ఈ ఏడాది కాలంలో నిర్వహించిన బ్లడ్ క్యాం పుల ద్వారా 70 యూనిట్స్ ప్రభుత్వ వైద్యశాలలకు అందజేశారు. ముఖ్యమైన పం డుగలు, మహనీయుల జయంతి, వర్ధంతుల సందర్భంగా, రిపబ్లిక్ డే, స్వాతంత్ర్యదినోత్సవం తదితర ప్రత్యేక రోజుల్లో క్లబ్ ద్వారా వారు నిర్వహించే కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. దీంతో క్లబ్ సభ్యులతో పాటు ఇతరులు కూడా వారి సేవా కార్యక్రమాలకు చేయూత నందిస్తున్నారు.

కుట్టు మిషన్‌తో జీవనోపాధి



పేదరికంలో ఉన్న నాకు వాసవీ క్లబ్ వారు కుట్టుమిషన్‌ను అందజేశారు. అది నాకెంతగానో ఉపయోగ పడుతోంది. నాకు జీవనోపాధికి మార్గమైంది. వాసవీ ప్రతినిధులకు కృతజ్ఞతలు. అందరూ ఆలోచిస్తే ఎంతోమంది పేదలకు మేలు జరుగుతుంది. - ఎం.ఉషాబాల

తోటివారికి సాయపడటమే దైవత్వం



తోటివారికి సాయపడడమే దైవత్వమని మేము మనస్ఫూర్తిగా విశ్వసిస్తాం. పది మందికి సాయం అందించే భాగ్యం కల్గడం అదృష్టంగా భావిస్తున్నాం. మా సేవలన్నీ పారదర్శకంగా ఉంటాయి. మమ్మల్ని ప్రోత్సహించిన అందరికీ కృతజ్ఞతలు.

- వల్లంపట్ల వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్, వాసవీ క్లబ్, చీరాల

వెలుగులోకి అనేక అక్రమాలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలోని గ్రేడ్-5, 6 (సచివాలయ ఉద్యోగుల) బదిలీల్లో అనేక అక్రమాలు చోటుచేసు కున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు, కలెక్టర్ ఇచ్చిన ప్రొసిడింగ్స్‌కు విరుద్ధంగా జిల్లా పంచాయతీ పూర్వ అధికారి ఉషారాణి తన ఇష్టారీతిన బదిలీలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇందులో పంచాయతీ కార్యాలయ ఉద్యోగులను బలిపశువులను చేసి ఆమె ఇష్టారీతిన బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తేలింది. ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులపై భారీ అవినీతి, అక్రమాలు జరగడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమగ్ర విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు చైర్మన్‌గా, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర్ నారాయణరెడ్డిలను సభ్యులుగా నియమించారు. రెండురోజుల పాటు నిర్వహించిన విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులను కూడా బుట్టదాఖలు చేసిన పరిస్థితిని గుర్తించినట్లు సమాచారం.

ఒకరికి రెండు చోట్ల ఆర్డర్లు

ఒక ఉద్యోగికి ఒకచోట మాత్రమే బదిలీ పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా రెండు ఆర్డర్లు ఇచ్చారంటే అవినీతి ఏస్థాయిలో చోటుచేసుకుందో అర్థమవుతుంది. గ్రేడ్-5లో ఆరుగురికి, గ్రేడ్-6లో 39 మంది ఉద్యోగులకు రెండు బదిలీల ఆర్డర్లు ఇవ్వగా ఒక ఉద్యోగికి ఏకంగా మూడు చోట్లకు ఇచ్చిన విషయం త్రిసభ్య కమిటీ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇవ్వడమే కాకుండా, 53 మంది గ్రేడ్-5 ఉద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా గ్రేడ్-4లో నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. కాగా బదిలీల్లో జరిగిన అక్రమాల నేపథ్యంలో ఈనెల 8న సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన తర్వాత ఉషారాణి బదిలీల ఉత్తర్వులపై సంతకాలు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పావుగా వాడుకున్నట్లు సమాచారం. ఆ ఉద్యోగిని పురమాయించి 'నీకు నేను ఉన్నాను. ఎటువంటి భయం లేదని' చెప్పి అతని ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు బయటపడింది.

సీసీ ఫుటేజీ స్వాధీనం

కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం నుంచి జిల్లా పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న సీసీఫుటేజి ద్వారా ఉషారాణి ఉంటున్న కార్యాలయంలోకి ఏఉద్యోగి వెళ్లి వస్తుంది కూడా గుర్తించారు. ఆ ఫుటేజీను కూడా సీజ్ చేసి విచారణ నివేదికలో పొందుపర్చడమే కాకుండా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులనే కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వారిని కూడా ఇందులో ఇరికించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. రెండు రోజులపాటు జరిగిన విచారణలో ఉషారాణి విచారణాధికారులు అడిగిన ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పకుండా తనకు వారు తెలుసు, వీరు తెలుసంటూ దాటవేసినట్లు సమాచారం. అలా చెప్పడమే కాకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు తనకు అపాయింట్‌మెంట్ ఉందని, అక్కడ అంతా చెప్తానంటూ విచారణాధికారులను భయపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

అంతా ఆమె ఇష్టారాజ్యం

త్రిసభ్య కమిటీ చేసిన రెండు రోజుల విచారణలో తాను ఎలాంటి తప్పులూ చేయలేదని, బయట జరిగే పరిణామాలతో తనకేమీ సంబంధం అని పూర్వపు డీపీవో ప్రశ్నించడమే కాకుండా ఇష్టారీతిన మాట్లాడినట్లు తెలిసింది. మరోవైపు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా నగదు లావాదేవీలు తీసుకున్న ఉద్యోగులు పూర్వ డీపీవో ఉషారాణి ఎదుట తాము తాము ఎంత ఇచ్చామో విచారణాధికారులకు చెప్తుంటే ఆమె వారిని కూడా భయపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అవుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కుపైగా ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు దాదాపు 24 వేల మంది ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో మాదిరిగానే డిగ్రీ కళాశాలల్లోనూ ఫీజుల్ని నిర్దేశించారు. సాధారణ కోర్సులకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు, బీఎస్సీ కంప్యూటర్, ఇతర కోర్సులకు రూ. 18 వేల వరకు ఫీజులు నిర్దేశించారు. ఇంతకు మించి అదనంగా ఫీజులు వసూలు చేయకూడదని ఉన్నా, యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన కౌన్సెలింగ్ ఫీజు కంటే దాదాపు డబుల్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే.. వేధింపులు

గుంటూరు నగరం నడిబొడ్డున్న ఉండి సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పుకునే కళాశాలల్లో ఇటీవల భారీ మొత్తంలో అదనంగా ఫీజులు వసూలు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ.20 వేలకుపైగా ఫీజులు వసూలు చేశారు. దీనికి ల్యాబ్, ఎగ్జామినేషన్ ఫీజులు అదనంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఇప్పటికే రెండుసార్లు ఆర్‌జేడీ కార్యాలయంలో, మరో రెండు సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా యాజమాన్యంలో మార్పురాలేదు సరికదా ఫిర్యాదు చేసిన విద్యార్థులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● నగరంలో మహిళల కోసం ఉన్న ఒక అన్‌ఎయిడెడ్ కళాశాలలో కూడా ఇష్టారాజ్యంగా ఫీజులు దందా నడుస్తోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకున్నా ఫీజులు మాత్రం భారీగానే ఉంటున్నాయి. యాజమాన్యాలు చెప్పిందే ఫీజు అంటూ వసూళ్ల పర్వం సాగుతోంది. దీనికి అరకొర వసతులతో హాస్టల్ నిర్వహిస్తూ ఫీజులు దండుకుంటున్నారు. ఇక్కడ కళాశాలకు గ్రౌండ్, ఇతర మౌలిక వసతులు లేకున్నా భారీ సంఖ్యలో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. ఫీజుల భారం, కళాశాల యాజమాన్యం వేధింపులతో ఓ విద్యార్థిని మూడోఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

● బ్రాడీపేట ప్రాంతాల్లో ఉన్న మూడు అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఫీజుల దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఓ కళాశాల కరస్పాండెంట్ ఒకే ప్రాంగణంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు, హాస్టల్ నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో ఇదే ప్రాంగణంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● తెనాలి, నరసరావుపేట, మాచర్ల ప్రాంతాల్లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్ని గత ఐదేళ్లలో ఏనాడు ఉన్నత విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసిన సంఘటనలు లేవు. పల్నాడులో ఎక్కడ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి అనే విషయం కూడా ఆర్‌జేడీ కార్యాలయం అధికారులకు తెలియని పరిస్థితి.

ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు

జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు చెల్లించే ఎగ్జామినేషన్ ఫీజుతోపాటు, సర్టిఫికెట్లు జారీ సమయంలో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాల అభివృద్ధి పేరుతో కొన్ని చోట్ల అదనపు దోపిడీ సాగుతోంది.

పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణం విద్యుత్ ప్రమాదాలకు కోరలు చాపి ఉంది. వివిధ రకాల కమర్షియల్స్, నివాసాలు అధికంగా ఉండడంతో విద్యుత్ సర్వీసులు అధికంగానే ఉన్నాయి. అయితే బిల్డింగ్‌ల మధ్య సర్వీసులకు సంబధించిన విద్యుత్ సర్వీసులు, ప్రధాన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏదయినా మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టే క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఈ తరహా సంఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని మసీదు పక్క బిల్డింగ్‌ను యజమాని మరమ్మతులు చేపట్టారు. అక్కడే తీగలు ప్రమాదంగా ఉండడంతో నియంత్రించేందుకు తాపీ మేస్త్రీ ప్లాస్టిక్ కవర్‌లతో కవర్ చేసే ప్రయత్నం చేశారు. కానీ ఇది కూడా ప్రమాదమే అని అవగాహన అతనికి లేదు.

ఇటీవలే చీరాల పరిధిలో విద్యుత్ ప్రమాదంతో ఇరువురు యువకులు మృతి చెందిన ఉదంతం అందరికీ విదితమే. ఈ క్రమంలో ఇప్పటికైనా అధికారులు వీటిపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



జ్యోతి చంద్రమౌళిని సన్మానిస్తున్న విజయవాడ ఆకాశవాణి అధికారులు

జ్యోతి చంద్రమౌళికి సన్మానం

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి బుధవారం విజయవాడలోని ఆకాశవాణిలో సన్మానించారు. ఆంధ్ర రాష్ట్రంలో చారిత్రక కట్టడాలు అనే అంశంపై ఆకాశవాణిలో జరిగిన రికార్డింగ్‌కు చంద్రమౌళి హాజరయ్యారు. ఆకాశవాణి ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా చంద్రమౌళిని ఆకాశవాణి అధికారులు సన్మానించారు.

రీ-సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభ

తహసీల్దార్ పార్వతి



వేటపాలెం(చీరాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించే గ్రామ సభలో రీ-సర్వేకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని బుధవారం తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సభ జరుగుతుందన్నారు. గత రీ సర్వే అనంతరం భూ సమస్యలు ఉంటే రైతులు దరఖాస్తులు అంద జేయాలన్నారు. కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పార్వతి కోరారు.

పల్లాకు తెగులు సోకితే మొక్కను పీకేయాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మినుములో పల్లాకు తెగులు సోకిన మొక్కలను ముందుగానే గుర్తించి వాటిని ప్రాథమిక దశలోనే పీకేయాలని వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని రామాయపాలెం తిమ్మయపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుమును పరిశీలించిన ఏవో రైతులతో మాట్లాడారు. తెగులు సోకిన మొక్కలు పసుపు రంగులోకి మారి ఎండిపోతాయన్నారు. రసం పీల్చే పురుగువల్ల ఇలా జరుగుతుందన్నారు. థయోమిథాక్సం మం దును పిచికారీ చేయాలని ఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగం రామాంజనేయరెడ్డి, హనుమంతరావు, రాజశేఖర్‌రెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఖాజాబి పాల్గొన్నారు.

మినుము మునిగింది

- కోత దశలో కురిసిన వర్షాలు
- అపారనష్టమని రైతుల ఆవేదన



చినమల్లవరంలో మినుము పైరును మేస్తున్న గొర్రెలు

పంగులూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు మండలంలో అధిక వర్షాలతో కోత దశలో ఉన్న మినుము మునిగిపోయింది. దీంతో అపార నష్టం వాటిల్లింది. మండలంలో 3,486 ఎకరాలలో మినుమును సాగు చేయగా, కోత దశకు చేరుకున్న సుమారు రెండు వేల ఎకరాలలో చేతి కొచ్చిన పంట నీటిపాలయింది. అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు కోతకొచ్చిన కాయ పంటచేలో మొలకలు రావడంతో పూర్తి నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని కొండమూరులో 11 వందల ఎకరాలలో మినుము సాగు చేయగా, రేణంగివరంలో 364, అలవలపాడులో 302, ముప్పవరంలో 239, కొండమంజులూరులో 155, బైటమంజులూరులో 196, కొప్పెరపాడులో 170, కశ్యాపురంలో 111, కొప్పెరపాడులో 170, తక్కెళ్లపాడు, బూదవాడ, మల్లవరం గ్రామాలలో వందల ఎకరాలలో మినుము సాగు చేపట్టారు. పురుగు, తెగుళ్ల కారణంగా అధికంగా మందులు వాడి వ్యయ ప్రయాసలతో పంటను కాపాడుకున్నప్పటికీ అధిక వర్షంతో అంతా నీటిపాలయిందని రైతులు వేదన చెందుతున్నారు.

నష్ట పరిహారం కోసం ఎన్యూమరేషన్ చేపట్టాం

మినుము పంట నష్టం అంచనా కోసం బుధవారం నుంచి ఎన్యూమరేషన్ చేపట్టామని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. 33శాతం పైగా పంట నష్టం జరిగిన రైతుకు ప్రభుత్వ సాయం అందుతుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. 1900 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని ప్రాథమిక నివేదిక అధికారులకు పంపడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్ర సిబ్బంది, వీఆర్వోలు పంట నష్టం అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలి
- ఎంపీడీవో స్వరూపారాణి
- పలు అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పంగులూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వాటిని అరికట్టేందుకు గ్రామాలలో వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు సత్వర వైద్య సేవలందించాలని ఎం పీడీవో కె.స్వరూపారాణి సూచించారు. పంగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. తహసీల్దార్ పోపూరి సింగారావు మాట్లాడుతూ భూములు రీ-సర్వే జరిగిన గ్రామాలలో సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బైపరకేషన్ కారణంగా ఖాళీ అయిన రేషన్ షాపుల భర్తీకి ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రాథమిక చర్యలు చేపట్టామని, గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. అధిక వర్షాలకు మినుము పంటకు అపార నష్టం వాటిల్లిందని ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. 2వేల ఎకరాలలో మినుము పంటకు నష్టం జరిగినట్లు అంచనా నివేదిక అధికారులకు అందచేశామన్నారు. 33 శాతం పైగా పంట నష్టం వాటిల్లిన రైతులకు నష్ట పరిహారం అందేలా గ్రామాలలో ఎన్యుమరేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధి నిధులతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఏఈ హనుమంతరావు చెప్పారు. మండలంలో 26 గోకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం సంతోషం తెలిపారు. విద్యాశాఖపై ఎంఈవో వీరాంజనేయులు, పారిశుధ్యం, తాగు నీరుపై ఈవోఆర్డీ కే సుమంత్ చర్యలను వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీల, ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, పశు వైద్యాధికారి మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు శివయ్య, కిషోర్‌కుమార్, ఆంజనేయులు, ఐసీడీఎస్ అధికారి జయప్రద, ఏఎస్‌డబ్ల్యూవో ప్రతినిధి సుబ్బారావు, ఫారెస్ట్ బీటీ రమేష్, సాల్మన్, సర్పంచ్‌లు గుడిపూడి నాగేంద్రం, వీరయ్య, పెంట్యాల కిష్టారావు, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు స్రవంతి, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

యోగాలో చందలూరు విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పంగులూరు, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన యోగా పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 22వ తేదీన ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 క్యాటగిరీలో నాయపాము శృతి (ప్రథమ స్థానం), కె.సరిత (2వ) ఎన్. భవ్య (మూడవ స్థానం) కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఎం.వెంకటేష్ ఎంపికయ్యాడు. అండర్ 17 క్యాటగిరీలో ఎస్.ప్రీతి రిథమిక్ యోగా పోటీకి ఎంపికైంది. అండర్ 17 లో స్టాండ్ బైలో ఎ.లిఖిత, ఎం.రత్నకుమారి ఎంపికయ్యారు. వీరంతా నవంబరు 2, 3 తేదీలలో నెల్లూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీ కొండా ప్రతిమ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ప్రతిమను హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు, గృహాల విద్యుత్ వినియుగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని అశాఖ అద్దంకి డీవిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. వైదనలో బుధవారం రైతులతో విద్యుత్ అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడైనా రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అవసరమైతే దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఏడీఈఈ సురేంద్రబాబు, ఎఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని వినియెగించుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. బుధవారం మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో వరి పంటను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోఏఈవో వంశి, వ్యవసాయ సహాయకులు రాణి, శ్రావణి, మార్కెటింగ్ సిబ్బంది సురేష్, సర్పంచ్ ముంద్రు దానయ్య పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆనంద జీవితం

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం వినియోగం వలన ఆనందంగా జీవిస్తారని స్థానిక స్వర్ణ రోడ్డులోని శతాయుష్ ఇంటర్నేషనల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ సిబ్బంది తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఔషదం వలన మేధాశక్తి పెరుగుతుందని వివరించారు. దీనిని పుష్య నక్షత్రం రోజున మాత్రమే వినియోగిస్తారని చెప్పారు. శ్వాసకోశ సమస్యలు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



29న మెగా జాబ్ మేళా

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నెల 29వ తేదీన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. 25కు పైగా కంపెనీలు హాజరయ్యే జాబ్ మేళాలో సుమారు వెయ్యి మందిని ఎంపిక చేయనున్నారు. పదవ తరగతి నుంచి పీజీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత జాబ్ మేళా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీంధ్ర కోరారు. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో గల కామేపల్లి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరగాల్సిన జాబ్ మేళాను కామేపల్లి కల్యాణ మండపానికి మార్పు చేసినట్లు తెలిపారు.

ఆక్రమణలన్నీ తొలగించాల్సిందే



మేదరమెట్ల బస్టాండ్ ముందు అక్రమణదారులతో మాట్లాడుతున్న డీఎం రాంమోహనరావు

మేదరమెట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌కు అన్ని వైపులా ఉన్న ఆక్రమణలను కచ్చితంగా తొలగించాలని డీఎం రాంమోహనరావు అక్రమణదారులను హెచ్చరించారు. బుధవారం రాత్రి మేదరమెట్ల బస్టాండ్‌కు వచ్చిన ఆయన అధికారులతో కలిసి అక్రమణదారులతో మాట్లాడారు. బస్టాండ్‌కు పడమర వైపు, ఉత్తరం వైపు ఉన్న ఆక్రమణలు అన్ని తొలగించాల్సిందే అన్నారు. ఉత్తరం వైపు, పడమర వైపు షాపులకు అద్దెలకు ఇస్తామని, దరకాస్తులు అద్దంకి డిపోలో అందుబాటులో ఉన్నాయని, అవసరమైనవారు దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివిధ రకాల షాపులను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రత్నం, వలి, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలకు వేగవంతంగా పరిష్కారం

వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు



ఎస్సై కమలాకర్‌ను అభినందిస్తున్న సీఐ శ్రీనివాసరావు

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రజల సమస్యలు వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మారీదు శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పరిధిలో ప్రజానీకం అధికంగా ఉండడంతో స్టేషన్‌కు నిర్ణీత అధికారులు అవసరముందన్నారు. సీఐ వినతి మేరకు బుధవారం ఎస్ఐలు కమలాకర్, భాస్కరరావును ఎస్పీ తుషార్ డూడి నియమించారు. దీంతో వారు రిపోర్ట్ చేశారు. వారికి స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎస్సై కమలాకర్ వేటపాలెంలో సుమారు రెండేళ్ల విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సీఐ వారికి సూచనలు చేశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన గ్రామ రెవెన్యూ సభను బుధవారం మండలంలోని చక్రాయపాలెం సచివాలయం వద్ద నిర్వహించారు. నరసింహాపురం రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలపై 20 మంది అర్జీలను అందజేశారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్





